




ఉష్ణోగ్రత (అంచనా)

| 22-4-2025 | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| గుంటూరు | 41 | 26 |
| తెనాలి | 39 | 26 |
| నరసరావుపేట | 40 | 25 |
| బాపట్ల | 37 | 27 |
| రెంటచింతల | 42 | 25 |

# కొలిక్కి వస్తున్న రీ సర్వే



- తప్పులు సరిచేస్తూ...సమగ్రంగా
- పైలట్ ప్రాజెక్టుగా గతంలోనే మండలానికో గ్రామం
- రెండో విడత కూడా ప్రారంభం
- ఇప్పటికే గ్రామ సభలు పూర్తి.. హద్దులు గుర్తింపు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

గత ప్రభుత్వం రీ సర్వే పేరిట చేసిన ప్రహసనం భూములకు మరిన్ని చిక్కులు తెచ్చి పెట్టిందే తప్ప రైతాంగానికి ఒనగూరిన ప్రయోజనం గుండుసున్నా. ప్రణాళికలు లేకుండా చేపట్టిన రీ సర్వే తంతుతో ప్రభుత్వం మారగానే ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా వేల సంఖ్యలో అర్జీలు ప్రభుత్వానికి అందాయి. వీటిలో అధికశాతం భూ సంబంధమైనవే కావడం గమనార్హం. దీంతో ప్రస్తుత ప్రభుత్వం ఈ ఏడాది జనవరిలో పక్కా ప్రణాళికతో మండలానికి ఓ గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసి రీ సర్వే నిర్వహించింది. ఈ గ్రామాలన్నీ కూడా గత ప్రభుత్వంలో రీ సర్వే చేయనివే కావడంతో ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా రీ సర్వేని యంత్రాంగం చేపట్టింది. కోర్టు పరిధిలో ఉన్న భూ వివాదాలు మినహా రీ సర్వే ఓ కొలిక్కి వచ్చే సరికి ఆయా గ్రామాల్లోని రికార్డుల్లో ఎలాంటి తకరారు లేకుండా పక్కాగా ఆర్‌వోఆర్ ఉండాలనేదే ప్రభుత్వ ఉద్దేశం. దీనికి అనుగుణంగానే ఎంపిక చేసిన గ్రామాల్లో ఇప్పటికే జీటీ పూర్తి చేసిన యంత్రాంగం 9(2) కింద గ్రామాల్లో ఉన్న భూ యజమానులందరికీ నోటీసులు జారీ చేసి అభ్యంతరాలను స్వీకరించింది. వాటిని డిస్పోజ్ కూడా చేసింది. డీఎల్ఆర్ అంకాన్ని కూడా ముగించిన యంత్రాంగం చివరిగా ఆర్‌వోఆర్ సిద్ధం చేసి గ్రామాల్లో జాబితా ప్రదర్శించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ప్రక్రియ అంతా కూడా దాదాపుగా ముగింపుకొచ్చింది. ఆ తర్వాత రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో భూ వివాదం అనే మాటే వినిపించకూడదనేది ప్రభుత్వ అంతిమ లక్ష్యంగా ఉంది. దీనికి అనుగుణంగా రీ సర్వేని పక్కాగా చేపట్టడానికి ఆ విధుల్లో ఉన్న సిబ్బందికి వేరే డ్యూటీలు వేయకుండా అన్ని వసతులు సమకూర్చి పూర్తి పారదర్శకంగా రీ సర్వే జరిగేలా ప్రభుత్వం తోడ్పాటునందించింది

**రెండో విడత రీ సర్వే ఇప్పటికే ప్రారంభం**

ప్రభుత్వం దశల వారీగా అన్ని గ్రామాల్లో రీ సర్వే పూర్తి చేయాలన్న ఆలోచనలో ఉంది. దీనిలో భాగంగానే పైలట్ గ్రామాల్లో రీసర్వే కొలిక్కి వస్తుండగానే గుంటూరు జిల్లాలో 18, పల్నాడులో 28, బాపట్ల జిల్లా పరిధిలోని 25 గ్రామాల్లో ఈ నెల 2 నుంచి మలివిడత రీసర్వే ప్రభుత్వం ప్రారంభించింది. ఇప్పటికే గ్రామ సభలను పూర్తి చేసిన యంత్రాంగం హద్దులను గుర్తించే ప్రక్రియ వేగంగా చేస్తోంది. తొలుత మండలానికి రెండు గ్రామాల చొప్పున రెండో విడత రీ సర్వే చేపట్టాలని ప్రభుత్వం తలంచింది. దీనికి అనుగుణంగానే తొలుత ఆదేశాలు జారీ చేసిన ప్రభుత్వం ఇటీవల మండలానికో గ్రామంలోనే రీ సర్వే చేపట్టే విధంగా ఆదేశాలను సవరించారు. సిబ్బంది తక్కువగా ఉండడంతో పాటు కచ్చితత్వంతో కూడిన ఫలితాలను రాబట్టాలనే ఉద్దేశంతో రెండో విడత రీ సర్వే గ్రామాలను కుదిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. పైలట్ గ్రామాల్లో ప్రభుత్వం ఎంచుకున్న



రెండో విడత రీ సర్వేలో భాగంగా వేటపాలెం మండలం దేశాయిపేటలో నిర్వహిస్తున్న గ్రామ సభ (పాత చిత్రం)

నమూనా సత్ఫలితాలు ఇవ్వడంతో అదే ప్రక్రియలో మొత్తం భూములకు రీ సర్వే చేపట్టి భూ యజమానులకు భరోసా అందించే దిశగా ప్రభుత్వం అడుగులేస్తోంది. ఇదిలా ఉంటే రెండో విడతలో మూడు జిల్లాలో ఎంచుకున్న 71 గ్రామాల్లో వైసీపీ హయాంలో రీ సర్వేని ప్రారంభించి సగంలో కాడి వదిలేసిన 35 గ్రామాలను కూడా జాబితాలో సర్వే విభాగం చేర్చింది. ఇప్పటికే పైలట్ గ్రామాల్లో రీ సర్వే విజయవంతం కావడంతో పాటు ప్రభుత్వం ఎంచుకున్న నమూనా, యాప్ వినియోగంపై సిబ్బందికి ఓ అవగాహన వచ్చింది. దీంతో రెండో విడత కింద ఎంచుకున్న గ్రామాల్లో రీ సర్వే ఘట్టాన్ని పూర్తి చేయడానికి ప్రభుత్వం కేవలం రెండు నెలల సమయం మాత్రమే ఇచ్చి ఫలితాలు చూపెట్టాలని ఆదేశించింది. గడువులోపల రీ సర్వే పూర్తి చేయాలనే పట్టుదలతో యంత్రాంగం అడుగులేస్తోంది

**అభ్యంతరాల విషయంలో ఏకాభిప్రాయంతోనే..**

రీ సర్వే జరుగుతున్న గ్రామాల్లో వచ్చే అభ్యంతరాలకు సంబంధించి ఇరు పార్టీల అంగీకారంతోనే ఓ నిర్ణయానికి వస్తున్నామని సర్వేతో పాటు రెవెన్యూ విభాగం చెబుతోంది. అప్పటికీ ఒప్పుకోని పక్షంలో సహేతుకతలేని వినతులని తిరస్కరించి ముందుకు వెళుతున్నామని అధికారులు చెబుతున్నారు. మరింత సంక్లిష్టంగా ఉన్నవాటి విషయంలో రాష్ట్రస్థాయి అధికారుల ఆదేశాలకు అనుగుణంగా నిర్ణయం తీసుకుంటున్నామని అధికారులు చెబుతున్నారు. వైసీపీ హయాంలో రీ సర్వే జరిగిన అన్ని గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించగా ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా దాదాపు 11,000 అర్జీలు

(మిగతా 6వ పేజీలో)

# తెల్లబోతున్న జొన్న



మొన్నటి వర్షాలకు తడిచిన తెల్ల జొన్నలు

కృష్ణా పశ్చిమ డెల్టాలో రబీ సాగుకింద పండిన మొక్కజొన్న, జొన్న పంటలు చేతికొచ్చాయి. పంట అందుతున్న తరుణంలోనే వర్షాలూ వెంట వచ్చాయి. తడిచిపోవటం, పంట దెబ్బతినటం వంటివన్నీ ఒకెత్తయితే, పంట చేతికొచ్చినా అమ్ముకోలేని స్థితిలో రబీ రైతన్న ఉన్నాడు. ఒక్క మాటలో చెప్పాలంటే పండించిన పంట కొనే దిక్కులేక అల్లాడుతున్నాడు. జొన్నకు ప్రభుత్వం ఇచ్చిన మద్దతు ధర ఆకాశంలో ఉంటే, మార్కెట్‌లో ఉన్న వాస్తవ ధర పాతాళంలో ఉంది. అంటే... మార్కెట్ ధరకు, వ్యాపారులు కోతకోసి మరీ కొంటున్న ధరకు అంత వ్యత్యాసం ఉందన్నమాట. మొక్కజొన్నకు కొంత వరకు పర్వాలేదనిపిస్తున్నా, జొన్నరైతే దిగాలు పడుతున్నాడు. పెట్టుబడులు కూడా రాక అప్పుల ఊబిలో కూరుకుపోతున్నాడు. కష్టకాలంలో ఆదుకోవాల్సిన పౌరసరఫరాలు, మార్కెటింగ్ శాఖలు తాము జొన్నలు, మొక్కజొన్న కొనబోమని ఆలస్యంగా కబురు చెప్పటంతో జొన్నరైతన్నది దిక్కుతోచని స్థితి. పండించిన పాపానికి ఎంతోకొంత దక్కితే చాలని వ్యాపారులు, దళారులను ఆశ్రయిస్తే వర్షాల సాకుచూపి, తేమ ఉందని, రంగు మారిపోయాయంటూ మద్దతు ధరలో సగమే ఉన్న రేటు మరింత కోత కోసి రైతన్నను దగా చేస్తున్నారు. దీంతో పెట్టుబడులు కూడా దక్కక రైతన్న దిగాలు పడుతుంటే, కౌలు రైతుల పరిస్థితి మరింత దయనీయంగా మారింది.

## ధర లేదు... కొనే దిక్కూలేదు

- మొక్కజొన్న కూడా చేలల్లోనే అమ్మకాలు
- కొనుగోలు కేంద్రాల ఊసే ఎత్తని మార్కెటింగ్ శాఖ
- వర్షాలకూ దెబ్బతిని బోరుమంటున్న జొన్నరైతులు
- రంగు మారటంతో రేటు విషయంలో కోతకోస్తున్న వ్యాపారులు
- జొన్న మద్దతు ధర రూ. 3460... మార్కెట్ రేటు రూ. 1700లే
- అంతా దగానే... ఆదుకోకుంటే రైతన్నకు నష్టమే



తెల్ల జొన్నలను గోతాలకెత్తుతున్న కూలీలు

తెనాలి, వేమూరు, ఏప్రిల్ 21, (ఆంధ్రజ్యోతి): కృష్ణా పశ్చిమ డెల్టాలో 5.71 లక్షల ఎకరాలు సాగవుతుంటే, వాటిలో రబీ కింద మొక్కజొన్న, జొన్న, మినుము, పెసర పంటలు సాగయ్యాయి. వీటిలో మొక్కజొన్న, జొన్న పంటల సాగే ఎక్కువగా ఉంది. జొన్న 3.9 లక్షల ఎకరాల్లో సాగయితే, జొన్న 1.3 లక్షల ఎకరాల్లో సాగయిందనేది అధికారుల మాట. మిగిలిన విస్తీర్ణంలో మినుము, పెసర పంటలు వేశారు. అయితే వీటన్నిటికీ రేటు కొంత వరకు పర్వాలేదనిపించినా, తెల్లజొన్నకు మాత్రం దారుణంగా ఉంది.





దీంతో రైతు పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. అయితే మొక్కజొన్నకు మాత్రం మార్కెట్ రేటుకూడా మద్దతు ధరకు దగ్గరగా ఉండటంతో రైతులకు పెద్దగా నష్టం జరిగేదిలేదు. క్వింటా మొక్కజొన్నలకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ. 2,225గా ఉంది. అయితే మార్కెట్‌లో క్వింటాకు రూ. 2,100 నుంచి రూ. 2,200 వరకు వ్యాపారులే చెల్లిస్తుండటంతో రైతులు పెద్దగా కొనుగోలు కేంద్రాలకోసం ఎదురు చూడటంలేదు. శనివారం బాపట్ల జిల్లాలో క్వింటాకు ఖర్చులతో రైతులకు పనిలేకుండా రూ. 2120 రేటు చెల్లిస్తే, ఖర్చులతో రూ. 2,200 చెల్లించారని, దీనివల్ల పెద్దగా ఇబ్బందిలేదని, చేలల్లోనే వ్యాపారులు మద్దతు ధరకు దగ్గరగా ఇచ్చి కొంటున్నారని చెబుతున్నారు.

**మద్దతు ధర రూ. 3,460... కొనేది రూ. 1700లకే**

జొన్న డెల్టాలో 1.3 లక్షల ఎకరాల్లో సాగయితే దిగుబడి కూడా ఆశించిన స్థాయిలోనే వచ్చింది. ఎకరాకు 25 నుంచి 28 క్వింటాళ్ల వరకు దిగుబడులు రైతులకు దక్కాయి. కొన్ని చోట్లయితే 30 క్వింటాళ్లు కూడా వచ్చాయి. అయితే జొన్న మద్దతు ధర క్వింటాకు భారీగానే కేంద్రం నిర్ణయించింది. దీనిలో తెల్లజొన్న హైబ్రిడ్‌వయితే క్వింటాకు రూ. 3,371, మాల్దండి రకం జొన్నకయితే రూ. 3,421గా ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మద్దతు ధర కేవలం కాగితాలకే పరిమితమయింది.ప్రస్తుతం అంతా బాగున్న జొన్నలయితే క్వింటాకు వ్యాపారులు రూ. 2100 వరకు చెల్లిస్తున్నారు. అయితే ఎక్కువ శాతం సాకులుచూపి ధరలో కోత కోసేస్తున్నారు. తడవకుండా, మంచుకు రంగు మారినా, వర్షాలకు తడిచాయన్న సాకులు

(మిగతా 6వ పేజీలో)

# అమరావతి ఓఆర్ఆర్ నుంచి.. నిజాంపట్నానికి నాలుగు లైన్ల రోడ్డు

- రూ.317కోట్లతో ఆరు ఆర్వోబీలు
- హైవే అధికారుల సమీక్షలో ఎంపీ కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే కొండయ్య



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విజన్ రాష్ట్రానికి వరమని, అందరం సమష్టిగా పనిచేసి అభివృద్ధికి దోహదపడదామని ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే కొండయ్య పిలుపునిచ్చారు. సోమవారం బాపట్ల జిల్లా చీరాల ఆర్డీవో కార్యాలయంలో నేషనల్ హైవే అథారిటీ అధికారులతో ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా రోడ్ల నిర్మాణానికి చేపట్టిన భూ సేకరణ ప్రక్రియ వేగం పెంచి పనులను వేగంగా పూర్తి చేయాలన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో టీడీపీ కూటమి కృషితో రాబోవు రెండు, మూడేళ్లల్లో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతాయని చెప్పారు. ఇప్పటికే అమరావతి అవుటర్ రింగ్ రోడ్డు నుంచి నిజాంపట్నానికి నాలుగు వరుసల రహదారి మంజూరయిందని వివరించారు. అంతేకాకుండా ఇటీవల రూ.317కోట్ల నిధులతో 6 ఆర్వోబీ వంతెనలు మంజూరు కాగా, వాటిని తెనాలి నుంచి నిడుబ్రోలు, పెద అవుటుపల్లి ప్రాంతాల్లో నిర్మిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో 62 ఆర్వోబీలకు వినతులు చేయగా, నాలుగు మంజూరైనట్లు తెలిపారు. 58 ఆర్వోబీలపై కసరత్తు జరుగుతుందన్నారు. అంతేకాకుండా బాపట్ల జిల్లా పరిధిలోని చినగంజాం, చీరాల, సూర్యలంక బీచ్‌లు దేశంలోనే గుర్తింపు పొందేలా అభివృద్ధి చేస్తామని, టూరిజం అభివృద్ధితో ఉపాధి, ఆదాయం ఉంటుందని ఎంపీ, ఎమ్మెల్యే పేర్కొన్నారు. అనంతరం జాతీయ రహదారి నిర్మాణాలను పరిశీలించారు. సమావేశంలో జేసీ ప్రఖర్‌జైన్, అధికారులు పాల్గొన్నారు.

# బావుడాకు మరింత బలం



- భవన, లే అవుట్ల నిర్మాణాల అనుమతులు అథారిటీకి
- ఇటీవల ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- ఇకపై క్రమం తప్పకుండా సమీక్షలు, పట్టణ ప్రణాళికలపై కసరత్తు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం కొలువు దీర్చిన బావుడా(బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) కేవలం అలంకారప్రాయంగానే మిగిలింది. పట్టణాభివృద్ధిలో దాని పాత్రే లేకుండా వైసీపీ చేసింది. రాజకీయంగా నామినేటెడ్ పదవుల కల్పనకు పట్టణాభివృద్ధి సంస్థలను ఉపయోగించుకుందే కానీ, పట్టణాభివృద్ధిలో బావుడా పాత్ర ఏంటనేదానికి స్పష్టమైన నిర్వచనాన్ని వైసీపీ ప్రభుత్వం ఇవ్వలేకపోయింది. గత ఏలికలు నామమాత్రం చేసిన బావుడాను క్రియాశీలం చేసే చర్యలకు ప్రస్తుత కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దానిలో భాగంగా భవనాలకు, లే అవుట్లకు అనుమతులిచ్చే అధికారాలను బావుడాకు కట్టబెడుతూ ప్రభుత్వం తాజాగా ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటి వరకు వీటికి సంబంధించిన అనుమతులను డీటీసీపీ పర్యవేక్షించేది. గత ప్రభుత్వంలో పుట్టగొడుగుల్లా అనుమతిలేని లే అవుట్లతో పాటు భవనాలు వెలిశాయి. ఇప్పటికే వాటి జాబితాను ప్రభుత్వం పారదర్శకంగా పబ్లిక్ డొమైన్‌లో ఉంచిన సంగతి విదితమే. ప్రభుత్వం తాజాగా తీసుకున్న నిర్ణయంతో వాటి అనుమతులను పునఃసమీక్షించే అధికారం కూడా బావుడాకు సంక్రమించింది. ఇకపై అర్బన్ డెవలప్‌మెంట్ పరిధిలో జరిగే నిర్మాణాలపై క్రమం తప్పకుండా సమీక్షలు జరిపి, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వాటిపై జరిమానాల కొరడా ఝళిపించనున్నారు.

**బావుడాపై ప్రభుత్వం దృష్టి**

బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(బావుడా)ని 2022 డిసెంబరులో వైసీపీ ప్రభుత్వం కొలువుదీర్చింది. రెండేళ్ల వ్యవధిలో ఒక్క సమీక్ష జరిపిన పాపాన పోలేదు. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక బావుడాపై కూడా దృష్టి పెట్టింది. గతేడాది డిసెంబరులో ప్రకటించిన నామినేటెడ్ పదవుల జాబితాలో బావుడా ఛైర్మన్ కిరీటం టీడీపీ నేత సలగల రాజశేఖర్‌బాబును వరించింది. అప్పటి నుంచి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీపై దృష్టి పెట్టిన ప్రభుత్వం అధికారాలు కట్టబెడుతూ ఇటీవల ఆదేశాలు జారీ చేసింది.

**సిబ్బంది కేటాయింపు.. సమీక్షలూ జరపాల్సిందే**

బావుడా కార్యాలయంలో నిష్పత్తి ప్రకారం ఉండాల్సిన సిబ్బంది 9 మంది కాగా ప్రస్తుతం ముగ్గురితోనే నడుపుతున్నారు. ప్రభుత్వం బావుడా పరిధి పెంచడంతో పాటు నిర్మాణాల అనుమతులను పర్యవేక్షించాల్సి ఉన్నందున సిబ్బంది ఖాళీలను కూడా భర్తీ చేయనుంది. ప్రభుత్వ ఖజానాకు గండిపడకుండా నిబంధనల ప్రకారం బావుడా పరిధిలోని భవనాలు, లే అవుట్లు ఉండేలా చర్యలు తీసుకో నుంది. వీటికి సంబంధించి నెలవారీ సమీక్షలు జరపడం తో పాటు పురోగతిని కూడా బావుడా ప్రభుత్వానికి నివేదించనుంది.

**తాజా ఉత్తర్వుల ప్రకారం**

బావుడా పరిధిలోకి వచ్చే మండలాల్లో భవనాలు, లే అవుట్ల నిర్మాణాలను ఇకపై సదరు విభాగమే పర్యవేక్షించనుంది. తాజా ఆదేశాల ప్రకారం 4,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మాణం జరిగే భవన నిర్మాణాలు, 25 ఎకరాలలోపు వరకు లే అవుట్ల అనుమతులు ఇకపై బావుడానే ఇవ్వనుంది. గతంలో వీటిని పట్టణ ప్రణాళిక డైరెక్టరేట్ కార్యాలయం నుంచి తీసుకోవాల్సి వచ్చేది. ఈ మొత్తం ప్రక్రియలో జాప్యం తగ్గించడంతో పాటు పారదర్శకతకు పెద్ద పీట వేసే విధంగా ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలు ఉపకరించనున్నాయి. ఈ క్రమంలో మున్సిపాలిటీల అధికారాల్లో బావుడా జోక్యం చేసుకోకుండా స్పష్టమైన మార్గదర్శకాలను ప్రభుత్వం నిర్వచించింది.

**మరిన్ని నిర్ణయాలు వెలువడే అవకాశం**

వేమూరు నియోజకవర్గ పరిధిలో ఉన్న ఐదు మండలాలు గతంలో సీఆర్డీఏ పరిధిలో ఉండేవి. వైసీపీ ప్రభుత్వం వాటిని కూడా బావుడాలో చేరుస్తూ నిర్ణయం తీసుకుంది. ఆ తప్పులను సరిచేసే దిశగా ఆ మండలాలను తిరిగి సీఆర్డీఏలో కలుపుతూ ప్రస్తుత ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో బావుడా పరిధి రేపల్లె, బాపట్ల నియోజకవర్గాలకే పరిమితమైంది. ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ పరిధిలో ఉన్న అద్దంకి, పర్చూరు, చీరాల ప్రాంతాలను కూడా బావుడాలో కలిపే ప్రతిపాదనలను ప్రభుత్వం పరిశీలిస్తోంది. ఇదిలా ఉంటే గతంలోనే బావుడా పరిధిలోకి వచ్చే మండలాల్లోని పేదల ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.4లక్షల చొప్పున సాయం అందించే ఆదేశాలను ఇప్పటికే ప్రభుత్వం జారీ చేసింది. వీటితో పాటు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలకే కేంద్రం ప్రత్యేకంగా మంజూరు చేసే నిధులపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టిపెట్టడంతో పాటు అందుకు సంబంధించిన కసరత్తును బావుడా పాలకవర్గం చేయాలని ఆదేశించింది.

# ప్రమాణాలకే.. ప్రాధాన్యం



- ఇంటర్ విద్యలో నూతన మార్పులకు శ్రీకారం
- జాతీయస్థాయి ప్రమాణాలే లక్ష్యంగా సిలబస్, బోధన
- ఏపీ ఈ ఏపీ సెట్‌కు ఉపయోగం
- అధ్యాపకులకు త్వరలో శిక్షణ

గుంటూరు(విద్య) ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయిలో పోటీ పరీక్షలు, ప్రమాణాలే లక్ష్యంగా ఇంటర్ విద్యలో సమూల మార్పులకు ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది. దీంతోపాటు రాష్ట్ర స్థాయిలో ఏపీఈఏపీసెట్(ఎంసెట్) ద్వారా ఇంజనీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశ పరీక్షకు ఈ మార్పులు ఉపయోగపడనున్నాయి. ఇందులో భాగంగా ఇప్పటికే కొన్ని సబ్జెక్టులను కుదించి ఒకే సబ్జెక్టుగా మార్చడం. సిలబస్, పరీక్షల విధానం, మార్కుల కేటాయింపు తదితర అంశాల్లో కొత్త విద్యా సంవత్సరం నుంచి నూతన మార్పులు అమల్లోకి రానున్నాయి. ప్రధానంగా జాతీయస్థాయిలో నిర్వహించే ఐఐటీ జేఈఈ, నీట్ పరీక్షల్లో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా నూతన మార్పులు రానున్నాయని అధ్యాపకులు చెబుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ, ఎయిడెడ్ ఆధ్వర్యంలో 35 పైగా జూనియర్ కళాశాలలు, వృత్తి విద్య కళాశాలలు ఉన్నాయి. ఇంకా ప్రభుత్వ ఆధ్వర్యంలో ఆదర్శ పాఠశాలలు, కేజీబీవీలు, హైస్కూల్ ప్లస్, గురుకుల జూనియర్ కళాశాలలో మరో 50 వరకు ఉన్నాయి. అదేవిధంగా, ప్రైవేట్ యాజమాన్యాల ఆధ్వర్యంలో 100కు పైగా జూనియర్ కళాశాలలో ఉన్నాయి. ఆయా కళాశాలల్లో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో దాదాపు 80 వేల మందికి పైగా విద్యార్థిని విద్యార్థులు ఇంటర్ విద్య అభ్యసిస్తున్నారు . ఇంటర్‌లో ప్రస్తుతం ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ, హెచ్‌ఈసీ ప్రధాన గ్రూపులు ఉన్నాయి .వీటితో పాటు ఎంబైపీసీ గ్రూపును కూడా ఈ ఏడాది నుంచి ప్రవేశపెట్టడానికి ఇంటర్ బోర్డు సన్నాహాలు చేస్తున్నది. మరో వైపు వృత్తి విద్యా కళాశాలల్లో కూడా నూతన కోర్సులు సిలబస్‌లో మార్పులపై అధ్యయనం చేస్తున్నారు.

**ముందస్తు తరగతులు.. పుస్తకాల పంపిణీ**

ఇంటర్ బోర్డు ఆదేశాల ప్రకారం ఇప్పటికే అనేక కళాశాలలో తరగతులు ప్రారంభమయ్యాయి. గత నెల 24 నుంచి దాదాపు నెల రోజుల పాటు తరగతులు నిర్వహించారు .ప్రధాన సబ్జెక్టుల్లో రెండు మూడు యూనిట్లు కూడా పూర్తి చేశారు. అదేవిధంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు పుస్తకాల పంపిణీ కూడా ప్రారంభించారు.

**అధ్యాపకులకు శిక్షణ కోసం కసరత్తు**

ఇంటర్ బోధించే అధ్యాపకులకు మారిన సిలబస్ నూతన విధానాల ప్రకారం శిక్షణ తరగతులు నిర్వహించేందుకు ఇంటర్ బోర్డు కసరత్తు చేస్తోంది. జాతీయస్థాయి పరీక్షలకు అనుగుణంగా మారిన సిలబస్‌లో బోధన ఎలా చేయాలి.. , విద్యార్థుల్ని పరీక్షలకు ఎలా సన్నద్ధం చేయాలి .. వంటి అంశాలపై పునశ్చరణ తరగతులు నిర్వహించడానికి ప్రణాళిక లు సిద్ధం చేశారు. ఈ వేసవి సెలవుల్లోనే పునశ్చరణ తరగతులు పూర్తిచేసి జూనియర్ కళా శాలల ప్రారంభం నాటికి అధ్యాపకులను బోధనకు సన్నద్ధం చేయాలని యోచిస్తున్నారు.

**ఇంటర్ సిలబస్‌లో మార్పులు ఇలా ..**

ఇంటర్ ఇప్పటివరకు మాథ్స్ ఏ, బి సబ్జెక్టులు ఉన్నాయి. వీటిని ఒకే సబ్జెక్టుగా చేయనున్నారు. బోటనీ జువాలజీ సబ్జెక్టులను కలిపి బయాలజీగా (మిగతా 6వ పేజీలో)

## వరి కుప్పకు నిప్పు



వేల్పూరు(శావల్యాపురం) ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): వరి పంట గూడుకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించడంతో పూర్తిగా దగ్ధమైన ఘటన మండలంలోని వేల్పూరు గ్రామంలో సోమవారం జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సాదినేని వీరాంజనేయులు ఇర్లపాడుకు వెళ్లే డొంక దారిలో తనకున్న ఎకరం పొలంలో గత డిసెంబర్‌లో వరి పంట కోసి గూడు వేశాడు. గుర్తుతెలియని వ్యక్తులు సోమవారం తెల్లవారుజామున దానికి నిప్పంటించడంతో మంటలు చెలరేగాయి. విషయం తెలుసుకొన్న వీరాంజనేయులు గ్రామస్తులతో కలసి పొలానికి వెళ్లి మంటలు ఆర్పేందుకు ప్రయత్నించినా.. అప్పటికే పంటగూడు పూర్తిగా కాలిపోయింది. పంట విలువ రూ.75 వేలు ఉంటుందని, ఆరుగాలం శ్రమించి పంట పండిస్తే దుండగులు ఇలాంటి అక్రమాలకు పాల్పడుతున్నారని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. వేల్పూరులో ఇటీవల పొలంలో నిల్వ చేసిన పొగాకు బేళ్లు, గ్రామంలోని దొడ్డిలో వేసిన గడ్డివామిని కూడా ఇలానే కాల్చివేశారని, గ్రామానికి చెందిన వ్యక్తి ఒకరు ఇలాంటి దుర్చర్యలకు పాల్పడుతున్నాడని బాధితులు అనుమానం వ్యక్తం చేశారు. దీనిపై ఎస్‌ఐ లేళ్ల లోకేశ్వరరావును కలసి ఫిర్యాదు చేశామని తెలిపారు. దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

## ప్రమాణాలకే.. ప్రాధాన్యం

(5వ పేజీ తరువాయి)



ప్రభుత్వ వృత్తి విద్యా కళాశాల

మారుస్తున్నారు. దీనికి అనుగుణంగా మార్కుల కేటాయింపు చేస్తారు. పార్ట్ -1 లో ఆంగ్లం , పార్ట్ 2లో జాతీయ భాషలతో పాటు మరికొన్ని సబ్జెక్టులు ఉంటాయి. విద్యార్థి తన అభిరుచి మేరకు ఏదైనా సబ్జెక్టును ఎంపిక చేసుకునే వెసులుబాటు ఇంటర్ బోర్డు కల్పించనుంది. పార్ట్ -3లో ఎంపీసీ, బైపీసీ, హెచ్‌ఈసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపులు ఉన్నాయి. కొత్తగా ఈ విద్యా సంవత్సరం నుంచి ఎంబైపీసీ గ్రూపు ను కూడా ప్రవేశపెట్టనున్నారు. దీని ద్వారా ఇటు ఇంజనీరింగ్ అటు మెడికల్ ప్రవేశ పరీక్షల్లో కూడా విద్యార్థులు పాల్గొనే అవకాశం కలుగుతుంది. ఇదిలా ఉంటే పార్ట్ 1, 2, 3లలో వచ్చిన మార్కులే పరిగణలోకి తీసుకుంటారు. ఇందులో కనీసం ప్రతి సబ్జెక్టులో 35 మార్కులు రావాల్సి ఉంటుంది. వృత్తి విద్యా కోర్సుల్లో పాస్ మార్కుల్లో వ్యత్యాసం ఉంది. ఇక ఇంటర్‌లో విద్యార్థి ఎంచుకున్న అదనపు సబ్జెక్టుల్లో ఉత్తీర్ణులు అయితే మెడికల్, ఇంజనీరింగ్ బయోటెక్నాలజీ, బయో ఇన్ఫర్‌మాటిక్స్ వంటి కోర్సులు అధ్యయనానికి ఉపయోగపడతాయని అధ్యాపకులు చెప్తున్నారు.

### ప్రశ్నాపత్రంలో మార్పులు

ప్రశ్నాపత్రం విషయంలో మార్పులు తీసుకురానున్నారు. సైన్స్ గ్రూపుల్లో ఎన్సీఈఆర్టీ సిలబస్ ప్రకారం, ఆర్ట్స్ గ్రూపుల్లో హ్యూమానిటీస్ విధానాలను అనుసరించారు. సైన్స్ సబ్జెక్టుల్లో 85 మార్కులకు, ఇతర సబ్జెక్టుల్లో వంద మార్కులకు ప్రశ్నాపత్రం ఉంటుంది. ప్రయోగ పరీక్షలకు 30 మార్కులు కేటాయిస్తారు. ఇలా అనేక నూతన మార్పులకు ఇంటర్ బోర్డు శ్రీకారం చుడుతోంది. విద్యార్థులు భవిష్యత్తులో జాతీయస్థాయి పోటీ పరీక్షలు, ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో మెరుగైన ఫలితాలు సాధించేలా నూతన మార్పులు దోహదపడతాయని అధ్యాపకులు చెబుతున్నారు.

# తెల్లబోతున్న.. జొన్న

(5వ పేజీ తరువాయి)

చూపించి కొద్దిగా రంగులో వ్యత్యాసం కనిపించినా రూ. 1700 నుంచి రూ. 1800 వరకుమాత్రమే కొంటామని, లేకుంటే తీసుకుపోవాలంటూ తిప్పి పంపతున్న పరిస్థితి ఉంది. అయితే కొనుగోలు కేంద్రాలు ఉంటే, మరో ప్రత్యామ్నాయం రైతుల ముందుండేది. ఇప్పుడు ఏదీ లేకపోవటంతో వ్యాపారులు, దళారులు బెదిరిస్తున్నా చేసేదిలేక వారు చెప్పిన రేటుకే తెగ నమ్ముతున్నారు. మరోపక్క నిల్వ ఉంచుకుందామన్నా, మొక్కజొన్నయితే పర్వాలేదు కానీ, తెల్లజొన్న ఏమాత్రం రంగు మారినా, బూజుపట్టినా రేటు విషయంలో అసలుకే నష్టం వస్తుందనే ఆలోచనతో రైతులు నిల్వ ఉంచటానికి ధైర్యం చేయటంలేదు.

### జొన్నలు కొంటామని ఒకసారి... పొరపాటు పడ్డాం కొనలేమని మరోసారి...

జొన్నలు కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలుచేస్తాం... రేటు లేదని ఆందోళన పడాల్సిన పనిలేదు... ఇదీ గత వారం క్రితం పౌరసరఫరాల శాఖ అధికారులు చేసిన ప్రకటన. లేదు... లేదు... మీ జొన్నలు మేం కొనలేం. మేమే పొరపాటు పడ్డాం. మనుషులు తినేవి కాదు కనుక మేము కొనటానికి వీలులేదంటూ రెండు రోజుల తర్వాత మరో ప్రకటన. మొదటి ప్రకటన వచ్చినప్పుడు రైతులంతా సంతోషించారు. తమ జొన్నలు రేటు లేనితరుణంలో ప్రభుత్వం కొంటుంది కనుక నష్టం ఉండదని ఊపిరి పీల్చుకున్నారు. అయితే ఆ ఆనందం ఎన్నో రోజులు నిలవలేదు. రెండు రోజుల్లోనే మరో ప్రకటన కూడా అధికారుల నుంచే విడుదలయిందని, కేంద్రం సూచించిన ప్రకారం మన ప్రాంతంలో పండించే జొన్నలు మనుషులు తినేందుకు పనికివచ్చేవి కాదని, వాటిని పరీక్షిస్తే హానికర క్రిమిసంహారకాలు పెద్ద మోతాదులో ఉన్నట్టు తేలిందని, అందువల్ల ఆ జొన్నలు కొనలేమంటూ మరో ప్రకటన చేశారని రైతులే చెబుతున్నారు. దీని ప్రకారం చూస్తే ఇకపై కొనుగోలు కేంద్రాలు రబీ పంటల కొనుగోలుకు ఉండవనేది తేలిపోయిందని, అర్ధంతరంగా ఇటువంటి నిర్ణయం తీసుకుంటే ఎట్లాగంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ప్రకారం రూ. 3,460 అవసరం లేదని, కనీసం రూ. 2400 నుంచి రూ. 2600 వరకు జొన్నల నాణ్యతనుబట్టి రేటు నిర్ణయించినా చాలని వేడుకుంటున్నారు. కేంద్రాలు తెరవలేని పక్షంలో కనీస ధర అందేలా చూడాలని, ప్రభుత్వం దీనిపై వెంటనే ఒక నిర్ణయం తీసుకోకుంటే జొన్న రైతులు అప్పులపాలు కావటమేనంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోపక్క మినుములు, పెసలకూ మద్దతు ధర నిర్ణయిస్తే అంతటి రేటు అందుతున్న పరిస్థితిలేదు. మినుములు క్వింటాకు రూ. 7,400, పెసలు క్వింటాకు రూ. 8,682 చొప్పున మద్దతు ధరను ప్రభుత్వం నిర్ణయించింది. అయితే ప్రాంతాలను బట్టి రేట్లలో వ్యత్యాసం ఉన్నా, మద్దతు ధరను అందుకున్న పరిస్థితిలేదు. వీటిపై కూడా దృష్టిపెట్టాలనేది రైతుల విన్నపం. ఏదిఏమైనా జొన్న వంటి తక్కువ విస్తీర్ణంలో సాగయిన పంటలకయినా మద్దతు ధరకు దగ్గరగా కొనుగోలు చేయగలిగితే రైతులు గట్టెక్కినట్టే. పౌరసరఫరాల శాఖ దీనిపై నిబంధనల ప్రకారం కాకుండా రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని నిర్ణయం తీసుకోవలసిన అవసరం ఉంది.



మొక్కజొన్నలు రేటు ఆశాజనకంగా ఉండటంతో చేలల్లోనే లారీలకెత్తేస్తున్న రైతులు

# హోరాహోరీగా ఒంగోలు జాతి ఎడ్ల బల ప్రదర్శన

వినుకొండటౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మదమంచిపాటి వీరాంజనేయస్వామి తిరునాళ్లను పురస్కరించుకొని ఏర్పాటు చేసిన జాతీయ స్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బలప్రదర్శన పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. మొదటి స్థానం కైవసం చేసుకునేందుకు ఎడ్ల యజమానులు చివరి క్షణం వరకు శ్రమిస్తున్నారు. ఆరు పళ్ల విభాగంలో జరిగిన పోటీల్లో బాపట్ల జిల్లా వేటపాలెం, పంగులూరుకు చెందిన అత్తోటి శిరీషాచౌదరి, శివరామకృష్ణచౌదరి, చిలుకూరి నాగేశ్వరరావుకు చెందిన ఎడ్లు 5,448 అడుగులు లాగి మొదటి స్థానాన్ని కైవసం చేసుకున్నాయి. ప్రకాశం జిల్లా రాచర్ల మండలం ఆకువీడుకు చెందిన సూరా పూజితరెడ్డికి చెందిన ఎడ్లు 4,720 అడుగులు లాగి రెండో బహుమతి, పల్నాడు జిల్లా దాచేపల్లి కేసానుపల్లికి చెందిన నెల్లూరి రామకోటయ్యకు చెందిన ఎడ్లు 4581 అడుగులు లాగి 3వ బహుమతి, పల్నాడు జిల్లా నకరికల్లు మండలం చల్లగుండ్లకు చెందిన మేకా అంజిరెడ్డి ఎడ్లు 4,500 అడుగులు లాగి 4వ బహుమతి, బాపట్ల జిల్లా బల్లికురవ మండలం గంగన్నపాలేనికి చెందిన నలమాద ఉత్తమ్ పద్మారెడ్డి (ఎంఎల్ఏ, కోదాడ), టీఎస్ అండ్ రాయుడు సుబ్బారావుకు చెందిన ఎడ్లు 4,250 అడుగులు 5వ బహుమతి, నాగరికర్నూల్ తెలకపల్లి మండలం పర్వతపురానికి చెందిన శ్యామలా చరణ్‌తేజ, టీఎస్ ఉప్పునూతల మండలం వెల్లటూరుకు చెందిన శివరామకృష్ణ ఎడ్లు 3,781 అడుగులు లాగి 6వ బహుమతి కైవసం చేసుకున్నాయి. పోటీల్లో గెలుపొందిన యజమానులకు డాక్టర్ అన్నవరపు వీరాంజనేయులు, దూలం కోటిరెడ్డి, ఎస్. నారాయణరెడ్డి, నాగిరెడ్డి అంజిరెడ్డి, రొడ్డా నాగిరెడ్డి, నారాయణరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, రామినేని మణికిరణ్, లిఖిత, సోమేపల్లి బ్రహ్మయ్య, బట్టు గోపి, జక్కిరెడ్డి ప్రభాకరరెడ్డి, అనుమోలు నాగాంజిరెడ్డి నగదు బహుమతి అందజేశారు. పోటీలను తిలకించేందుకు వచ్చిన రైతులతో పాటు నిర్వాహకులకు, ఎడ్ల యజమానులకు మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు దేవస్థాన ఆవరణలో నిత్యం అన్నదాన కార్యక్రమం కొనసాగిస్తున్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు మక్కెన వెంకట్రావు, అనుమోలు సుబ్బారెడ్డి, మాదాల చిరంజీవి, కుంటా కోటిరెడ్డి, జగ్గారెడ్డి, అక్కిరెడ్డి, గురువారెడ్డి, కుంటా కోటిరెడ్డి, తిప్పిరెడ్డి, అంజిరెడ్డి, చప్పిడి రామారావు, పోకా సుబ్బారావు, నాగులపాటి గుర్నాథం, వెంకటరెడ్డి పాల్గొన్నారు.



ఆరు పళ్ల విభాగంలో మొదటి బహుమతి సాధించిన ఎడ్ల యజమానులకు బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

# బర్లీ పొగాకు కొనుగోళ్లు ప్రారంభించాలి

● ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ సమితి నాయకుల డిమాండ్

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పండిన బర్లీ పొగాకును కంపెనీలు, ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా క్వింటా రూ.18 వేలు ధర చెల్లించి కొనుగోలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ సమితి సమావేశం డిమాండ్ చేసింది. సోమవారం గుంటూరులోని మల్లయ్యలింగం భవన్‌లో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకుడు వై.కేశవరావు అధ్యక్షతన రైతు సంఘాల సమన్వయ సమితి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ ఈ ఏడాది క్వింటా రూ.4వేల నుంచి రూ.5 వేల వరకు కొనుగోలు చేస్తున్నారని, దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 9 జిల్లాల్లోని మూడు లక్షల ఎకరాల్లో రైతులు సాగు చేసిన పొగాకులో గణనీయమైన సంఖ్యలో బర్లీ పొగాకు ఉందని తెలిపారు. ఎకరానికి రూ.1.65 లక్షల పెట్టుబడి రైతులు పెట్టారని పంట మార్కెట్‌కు వచ్చే సమయానికి ప్రోత్సహించిన కంపెనీలు మొహం చాటేసాయని ఆరోపించారు. నల్లమడ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొల్లా రాజమోహన్ మాట్లాడుతూ వైట్ బర్లీ, నల్ల బర్లీ పొగాకు మొత్తాన్ని కొనుగోలు చేసే విధంగా కంపెనీలపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. సమితి నాయకులు పి.జమలయ్య, మర్రెడ్డి వెంకటరెడ్డి, తోట ఆంజనే యులు, మన్నవ హరిప్రసాద్, జి.ఈశ్వరయ్య మాట్లాడుతూ తక్షణమే పొగాకు పండించే ప్రాంతాల్లో సంఘాలతో సమావేశం నిర్వహించాలని డిమాండ్ చేశారు. 25వ తేదీలోపు సదస్సులు జరిపి ఉద్యమానికి సన్నద్ధం చేయాలని, 30లోపు ప్రజా ప్రతినిధులు వినతి పత్రాలు అందజేయాలని, మే 5న చలో ముఖ్యమంత్రి కార్యాలయానికి చేరుకుని సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని సూచించా రు. ఈ సమావేశంలో రైతు సంఘ నాయకులు వి.కృష్ణయ్య, వై. రాధాకృష్ణ, కొల్లి రంగారెడ్డి, పచ్చల శివాజీ పలు జిల్లాల నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేవీవీ ప్రసాద్, పాల్గొన్న కొల్లా రాజమోహన్ తదితరులు

## విశ్రాంత ఉద్యోగుల గగ్గోలు

● మూడో వారంలోనూ పింఛన్ చెల్లించని ఏఎన్‌యూ

పెదకాకాని, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం (ఏఎన్‌యూ) రిటైర్డ్ ఉద్యోగులు పెన్షన్ కోసం మూడు వారాలుగా ఎదురుచూస్తున్నారు. 2, 3 తేదీల్లో చెల్లించాల్సి పెన్షన్ ఇంతవరకు అందుక పోవడంతో వర్సిటీ విశ్రాంత ఉద్యోగులు గగ్గోలు పెడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించకపోవడంపై తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. విశ్వవిద్యాలయంలో సుమారు 700 మంది పెన్షనర్లకు నెలకు రూ.2.3 కోట్లు చెల్లించాలి ఉంది. ఇప్పటి వరకు ఆ మొత్తాన్ని విడుదల చేయకపోవడంతో వారంతా ఆర్థిక సతమతం అవుతున్నారు. పెన్షన్ చెల్లింపులో ఆలస్యం కారణంగా కుటుంబ పోషణ కష్టంగా మారిందని పెన్షనర్లు వాపోతున్నారు. విశ్వవిద్యాలయం విశ్రాంత ఉద్యోగులపై వర్సిటీ ఉన్నతాధికారులు నిర్లక్ష్య ధోరణిలో ఉన్నారు. దీంతో వర్సిటీ ఉన్నతాధికారుల చుట్టూ తిరుగుతూ తమ పెన్షన్ ఇప్పించాలని విశ్రాంత ఉద్యోగులు వేడుకుంటున్నారు. దీనిపై పెన్షన్ దారులు పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేయాలని యోచిస్తున్నారు. దీనిపై ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం వివరణిచ్చారు. పెన్షన్ కి సంబంధించి బ్లాక్ గ్రాండ్ రాలేదని ఆయన తెలిపారు. గ్రాంట్ అనుమతి రాగానే చెల్లింపులు చేపడతామని సమాధానం ఇచ్చారు.

## టీడీపీ సానుభూతిపరుడిపై హత్యాయత్నం

మనుమరాలిపై ఇద్దరు యువకుల వేధింపులు

మందలించినందుకు వైసీపీ మూకలతో దాడి

నకరికల్లు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): పల్నాడులో వైసీపీ అరాచకం పెచ్చుమీరింది. బాలికను వేధించొద్దని మందలించినందుకు.. ఆమె ఇంటిపై యువకుల తరఫున వైసీపీ గూండాలు దాడి చేశారు. బాలిక తాతయ్యపై హత్యాయత్నం చేసి, ఇంటిలోని సామగ్రిని ధ్వంసం చేశారు. పోలీసుల వివరాల మేరకు.. ఓ బాలికను కొన్ని రోజులుగా ఇద్దరు యువకులు వేధిస్తున్నారు. ఆదివారం మండలంలోని కుంకలగుంట గ్రామంలో నిదానంపాటి శ్రీ లక్ష్మీ అమ్మవారి తిరునాళ్లకు వెళ్లిన ఆ బాలికను యువకులు బైక్‌తో చెక్కర్లు కొండుతూ తీవ్ర వేధింపులకు గురిచేశారు. ఈ విషయం బాలిక కుటుంబ సభ్యులకు, బంధువులకు తెలిపింది. సంబంధిత యువకులను వారు హెచ్చరించారు. సోమవారం కూడా ఇలాగే వ్యవహరించటంతో ఆ యువకులను మందలించారు. దీనికి ఆగ్రహించిన ఆ యువకుల తరుఫున వైసీపీ గూండాలు ఆ బాలిక తాతయ్య ఇంట్లో నిద్రిస్తుండగా బండ తీసుకొని తలపై మోది హత్యాయత్నానికి పాల్పడ్డారు. కాళ్లతో, చేతులతో, కర్రలతో దాడి చేశారు. ఇంట్లోని వస్తువులన్నీ పగల గొట్టారు. బీరువాలో ఉన్న బంగారం, నగదును అపహరించుకుపోయారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన ఉప్పలపాటి సుబ్బయ్యను చికిత్స నిమిత్తం నరసరావుపేటలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. ఈ ఘటనతో గ్రామంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నా యి. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఘటన జరిగిన ప్రాం తంలో ఎప్పుడు ఏం జరుగుతుందోనని ఆ ప్రాంత ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు.

## భర్త వేధింపుల తాళలేక.. భార్య ఆత్మహత్య



శిరీష మృతదేహం

సత్తెనపల్లి రూరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఉరి వేసుకొని వివాహిత ఆత్మహత్య చేసుకుంటున్న ఘటన మండలంలోని కంటెపూడిలో సోమవారం జరిగింది. రూరల్ పోలీసులు కథనం మేరకు.. గ్రామానికి చెందిన గుంటగాని వేణు అలియాస్ వేమయ్యతో కట్టవారిపాలేనికి చెందిన శిరీషకు 16 సంవత్సరాల క్రితం వివాహమైంది. అప్పటి నుంచి వేణు మద్యానికి బానిసై తరచూ భార్యతో గొడవ పడుతూ ఉండేవాడు. మద్యానికి డబ్బులు ఇవ్వాలని వేధిస్తుండేవాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి కూడా భార్య శిరీషతో వేణు గొడవ పడ్డాడు. అతని వేధింపులు తాళ లేక శిరీష తెల్లవారు జామున ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఇది గమనించిన వేణు కుటుంబ సభ్యులు సమాచారాన్ని శిరీష తల్లిదండ్రులకు చేరవేశారు. శిరీష మృతి వార్త తెలుసుకున్న రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి, మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. శిరీషకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతురాలి తండ్రి చెరుకూరి నెహేమియా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు రూరల్ ఎస్‌ఐ అమీనుద్దీన్ తెలిపారు.

### సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం సోమవారం నాటికి 514.70 అడుగులు ఉంది. ఇది 139.78 టీఎంసీలకు సమానం. ఎస్‌ఎల్‌బీసీ ద్వారా 1350, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 1350 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

### పులిచింతల సమాచారం

అచ్చంపేట, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో సోమవారం 28.68 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు రాజు తెలిపారు. పవర్ జనరేషన్ ద్వారా నాలుగు వేల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుంది.

## కొలిక్కి వస్తున్న.. రీ సర్వే

(5వ పేజీ తరువాయి)

రాగా, ఒక్క బాపట్ల జిల్లలోనే 4,115 వినతులు వచ్చాయి. వీటిలో దాదాపు 80 శాతం పరిష్కరించారు. మిగిలిన వాటి విషయంలో నిర్ణయాన్ని ఉన్నతాధికారులకు రిఫర్ చేసినట్లు యంత్రాంగం చెబుతోంది. అదే విధంగా రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన 9,500 అర్జీల్లో 75 శాతం ఇప్పటికే పరిష్కరించామని, మిగిలిన వాటిలో కసరత్తు జరుగుతతుందనేది రెవెన్యూ విభాగం మాటగా ఉంది

### క్లిష్టతరం.....వైసీపీ నిర్వాకమే...

గ్రామ సభలతో పాటు రెవెన్యూ సదస్సులు, ఇప్పుడు ఎంపిక చేసిన గ్రామాల్లో జరుగుతున్న రీ సర్వే ఘట్టం ఇలా ప్రతి అంకంలోనూ గ్రామాల్లో సంక్లిష్టంగా ఉండే భూ వివాదాలు పదుల సంఖ్యలోనే వెలుగు చూస్తున్నాయి. వాటిపై ఓ నిర్ణయానికి రావడం యంత్రాంగానికి సవాల్‌గా మారింది. పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసి రీ సర్వే చేపట్టిన మూడు జిల్లాల గ్రామాల పరిధిలో దాదాపు 1050 సర్వే నెంబర్ల విషయంలో తుది నిర్ణయానికి రావడం అధికారులకు క్లిష్టంగా మారింది. వీటి పరిధిలో ఉన్న చిక్కులను పరిష్కరించడం యంత్రాంగానికి సవాల్‌గా మారిందది. దీనికి ప్రధాన కారణం వైసీపీ నేతలు అధికారం అండతో రికార్డులు తారుమారు చేసి మరీ భూములను చెరబట్టారు. అధికారికంగా లెక్కల్లో భూమి వారిపేరు మీద ఉంది కానీ బాధితులు మాత్రం పెద్దసంఖ్యలో కనబడుతున్నారు. కొంతమంది రెవెన్యూ సిబ్బంది అండతో అక్రమాలను సైతం పక్కాగా రెగ్యులరైజ్ చేయించుకునే తంతు గత ప్రభుత్వంలో విచ్చలవిడిగా నడిచింది. వీటి విషయంలో తుది నిర్ణయానికి వస్తే తప్ప గ్రామాల్లో భూ రికార్డులకు గాను ఫైనల్ ఆర్‌వోఆర్ ఓ కొలిక్కి వచ్చే అవకాశం లేదు. ఇలాంటి వాటిపై కూడా ఓవిధానపరమైన నిర్ణయం తీసుకునే దిశగా ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. రీ సర్వేని మమ అనిపించకుండా స దరు గ్రామాల్లో మళ్లీ భూ వివాదం అనే మాట వినపడడానికి వీల్లే దని, ఇదే సమయంలో బాధితుందరికీ న్యాయం జరగాల్సిందేనన్న పట్టుదలతో ప్రభుత్వం అడుగులేస్తుండడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

## హత్యాయత్నం కేసులో ఏడుగురికి జైలు, జరిమానా

నరసరావుపేట లీగల్, యడ్లపాడు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): హత్యాయత్నం కేసులో నేరం నిరూపణ కావడంతో ఏడుగురు నిందితులు ఒక్కొక్కరికి నాలుగు సంవత్సరాల జైలు శిక్ష, వెయ్యి రూపాయలు జరిమానా విధిస్తూ స్థానిక సహాయ సెషన్స్ న్యాయమూర్తి కె.మధుస్వామి సోమవారం తీర్పు వెలువరించారు. 2021 జులై 30న రాత్రి యడ్లపాడు మం డలం తిమ్మాపురం గ్రామంలో పంపు నీళ్లు తెచ్చుకునే విషయమై చోటు చేసుకున్న వివాదం చోటు చేసుకుంది. నేపథ్యంలో ఫిర్యాదిదారులు బిరుదు రవి, బిరుదు అనంతను నిందితులు అదే గ్రామానికి చెందిన కారు చోళ సుభాని, పెద్ద అంజయ్య, చిన్న కోటి లింగయ్య, మణికు మార్, బుజ్జి, పెద్ద కోటి లింగయ్య, హనుమంతరావు కత్తి, గొడ్డళ్లతో హత్యాయత్నానికి ఒడిగట్టారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు ప్రాథమిక దర్యాప్తు అనంతరం నిందితులను అరెస్టు చేసి కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతోపై విధంగా కోర్టు తీర్పు వెలువడింది.

## మహిళ హత్య కేసులో నిందితుడికి జీవితఖైదు

గుంటూరు(లీగల్), ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): చేతబడి చేస్తుందనే భయంతో పక్కింటి మహిళను కత్తితో నరికి చంపడమే కాకుండా.. అడ్డు వచ్చిన ఆమె సోదరిని కూడా కత్తితో పొడిచి చంపాలని ప్రయత్నించినట్టు నేరం రుజువు కావడంతో తుళ్లూరులోని కొత్తూరుకు చెందిన షేక్ నాగుల్ మీరావలికి జీవిత ఖైదు, రూ.2వేల జరిమానా విధిస్తూ గుంటూరు రెండవ అదనపు జిల్లా జడ్జి వై.నాగరాజు సోమవారం తీర్పు చెప్పారు. వివరాల మేరకు.. మృతురాలు లాల్ బీకి ఇంటి పక్కనే నివసించే షేక్ నాగుల్ మీరావలికి మధ్య స్థల వివాదం ఉంది. మంగళగిరి జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో వీరి మధ్య సివిల్ దావా కూడా నడుస్తోంది. ఈ నేపథ్యంలో లాల్ బీ రాత్రిపూట తన ఇంటి ముందు మంట వేసి, జుట్టు విరబోసుకుని దాని చుట్టూ తిరు గుతూ పెద్దగా అరుస్తూ ఉండటం నాగుల్ మీరావాలి గమనించాడు. ఓసారి ఆమెను చెంపపై కొట్టి మందలించాడు. అయినా ఆమె తన ప్రవర్తన మార్చుకోలేదు. దీంతో ఆమె మంత్రగత్తె అని, స్థల వివాదం నేపథ్యంలో తనపై చేతబడి చేస్తుందని భావించాడు. చేతబడి చేయవద్దని ఆమెను వేడుకొన్నాడు. పక్కనే ఉండే తన ఇంటిని ఖాళీ చేసి.. వేరే ఇంటికి మారాడు అయినా అతనిలో భయం పోలేదు. 2017 మార్చి 2న రాత్రి లాల్ బీ తన తండ్రి మౌలాలి సాహెబ్, సోదరి రాజంబీతో కలిసి ఇంట్లో ఉండగా నిందితుడు నాగుల్ మీరావలి కత్తితో వచ్చి ఆమెను మెడ నరికి చంపాడు. అడ్డువచ్చిన సోదరి రాజంబీని కూడా కత్తితో మెడపై పొడిచాడు. చుట్టుపక్కల వారు కేకలు వేయడంతో పరారయ్యాడు. లాల్ బీ అక్కడే మృతిచెందగా రాజంబి ఆసుపత్రిలో చికిత్స అనంతరం కోలుకుంటోంది. ఈ సంఘటనపై లాల్ బీ తండ్రి మౌలాలి సాహెబ్ ఫిర్యాదు మేరకు తుళ్లూరు పోలీసులు నిందితుడు నాగుల్ మీరావలిపై హత్య హత్యయత్నం కేసు నమోదు చేశారు. అప్పటి సీఐ సుధాకర్ రావు కేసు దర్యాప్తు జరిపి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బర్కత్ అలీ ప్రాసిక్యూషన్ నిర్వహించారు. మీరావలిపై హత్యాహత్యాయత్నం నేరాలు రుజువు కావడంతో.. జీవిత ఖైదు, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

## భార్య ఇంటికి రాలేదని ఆత్మహత్య

మాచర్ల రూరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని భైరవునిపాడులో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన సిరికొండ హనుమంతురావు (38)కు గుత్తికొండకు చెందిన సునీతతో 20 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ముగ్గురు కుమార్తెలు సంతానం. భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండడంతో భార్య సునీత నెల రోజుల క్రితం భర్త, పిల్లలను వదిలి గుత్తికొండలోని తన తల్లి ఇంటికి వెళ్లిపోయింది. వారం క్రితం హనుమంతురావు కుమార్తెలను తీసుకొని తన భార్య దగ్గరకు వెళ్లి, ఇంటికి రావాలని కోరాడు. భార్య సునీత అంగీకరించకపో వడంతో.. కలత చెందిన హనుమంతురావు సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని తల్లి నరసమ్మ ఫిర్యాదు మేరకు విజయపురి సౌత్ ఎస్‌ఐ షేక్ మహ్మద్ షఫి కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

### నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.40 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

### బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

| | |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ (కిలో) | 121, 129, 140 |
| చికెన్ విత్ స్కిన్(కిలో) | 228.00 |
| చికెన్ స్కిన్ లెస్(కిలో) | 238.00 |

## 1,42,976 మిర్చి టిక్కీల విక్రయం

గుంటూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 1,49,133 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1,42,976 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 63,568 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

| వెరైటీ | కనిష్ఠధర | గరిష్ఠధర |
|---|---|---|
| నాన్ ఏసీ కామన్ వెరైటీ | | |
| 334 | 9500 | 13000 |
| నంబరు.5 | 10000 | 12500 |
| 273 | 10000 | 12500 |
| 341 | 10000 | 13200 |
| 4884 | 10000 | 11300 |
| సూపర్10 | -- | -- |
| నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ | | |

| వెరైటీ | కనిష్ఠధర | గరిష్ఠధర |
|---|---|---|
| తేజ | 10000 | 13400 |
| షార్క్-1 | 10000 | 12000 |
| బ్యాడిగి 355 | 10000 | 13000 |
| సింజెంటా | | |
| బ్యాడిగి 5531 | -- | -- |
| దేవనూరుడీలక్స్ | 10000 | 12500 |
| ఆర్మూరు | 9800 | 11000 |
| తాలుకాయలు | 4500 | 6500 |

# బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

## నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించబోం

● ఎస్పీ తుషార్‌డూడి ● పీజీఆర్ఎస్‌కు 71 అర్జీలు

● దివ్యాంగులు, వృద్ధుల వద్దకు వెళ్ళి సమస్యలు తెలుసుకున్న ఎస్పీ



బాధితుల వద్దకే వచ్చి అర్జీలు స్వీకరిస్తున్న ఎస్పీ తుషార్ డూడి

బాపట్ల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన అర్జీలను పరిష్కరించటంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించబోమని పోలీసు అధికారులను ఎస్పీ తుషార్ డూడి హెచ్చరించారు. జిల్లాపోలీసు కార్యాలయంలో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌కు జిల్లాలోని వివిధ ప్రాంతాలు నుంచి 71 మంది బాధితులు అర్జీల ద్వారా తమ సమస్యలను ఎస్పీకి వివరించారు. కర్లపాలెం మండలం గణపవరం గ్రామానికి చెందిన కప్పల వెంకటసుజాత అంగవైకల్యంతో బాధపడుతూ నడవలేని స్థితిలో ఉన్న దివ్యాంగుడైన కుమారుడు యశ్వంత్‌కుమార్‌ను ఆటోలో తీసుకొచ్చి పోలీసు ప్రధాన కార్యాలయానికి వచ్చింది. ఈ విషయం తెలుసుకున్న ఎస్పీ ఆటో వద్దకు వచ్చి యశ్వంత్‌ను చూచి వారి సమస్యను అడిగి తెలుసుకున్నారు. చట్టపరిధిలో వారి సమస్యను పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. పిట్టలవానిపాలెం మండలం చందోలు గ్రామానికి చెందిన మహ్మద్ ఇలియాజ్, మరొక వృద్ధురాలు నడవటానికి ఇబ్బంది పడుతూ పోలీసు కార్యాలయానికి రాగా వారి పరిస్థితి గురించి తెలుసుకున్న ఎస్పీ వారి వద్దకెళ్ళి సమస్యను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌కు వచ్చిన అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు. జాప్యత వహించిన, నిర్లక్ష్యంగా వ్యవహరించిన సంబంధితాధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్, సీసీఎస్ డీఎస్పీ జగదీష్‌నాయక్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## డ్రోన్ టెక్నాలజిని రైతులు వినియోగించుకోవాలి

● జిల్లా వ్యవసాయాధికారి వై.రామకృష్ణ

బాపట్ల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : డ్రోన్ టెక్నాలజిని రైతులు వినియోగించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి వై.రామకృష్ణ తెలిపారు. బాపట్ల వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో వ్యవసాయంలో డ్రోన్స్ వినియోగంపై గ్రూప్ కన్వీనర్, కోకన్వీనర్‌లకు, బ్యాంక్ అధికారులు, వ్యవసాయాధికారులకు సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా వ్యవసాయాధికారి అధ్యక్షత వహించి మాట్లాడుతూ డ్రోన్ యంత్ర పరికరం ఖరీదు మీద 80 శాతం సబ్సిడీతో రైతు గ్రూప్‌లకు సరఫరా చేయటం జరుగుతుందన్నారు. డ్రోన్ టెక్నాలజిని అవలంభించటం వల్ల శ్రమ ఖర్చులు 50 శాతం వరకు తగ్గించుకోవచ్చు అని చెప్పారు. కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ బి.ప్రకాశరావు, సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ జె.రాజాదెబోరా తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి వై.రామకృష్ణ

## వక్ఫ్ ఆస్తులపై జవాబుదారితనం పెంచేందుకు ప్రధాని కృషి

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొండమూది

బాపట్ల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : వక్ఫ్ ఆస్తులపై జవాబుదారితనం మెరుగుపరిచి ఇష్టం వచ్చినట్లు ఆస్తులను సొంతం చేసుకోవటాన్ని నిరోధించటానికి వక్ఫ్ బోర్డుకొచ్చే ఆదాయాన్ని కొంతమంది బడాబాబులకు కాకుండా ఆర్థికంగా వెనుకబడిన ముస్లింల అభ్యున్నతి కోసం ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం పనిచేస్తుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొండమూది బంగారుబాబు, మైనార్టీ విభాగం జిల్లా కన్వీనర్ షేక్ కరీముల్లా, షేక్ నూర్జహాన్ అన్నారు. దీనికి సంబంధించిన కరపత్రాలను సోమవారం బీజేపీ జిల్లా కార్యాలయం వద్ద ఆవిష్కరించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ ప్రతిపక్షాలు ఓటుబ్యాంక్ రాజకీయాలు చేస్తూ సమాజంలో వైష్యమాలు సృష్టిస్తూ దేశంలో అశాంతి రేకెత్తించాలని కుట్ర చేస్తున్నాయన్నారు. ముస్లిం వర్గాలకు దీనిపై అవగాహన కొరకు కరపత్రాల ద్వారా ప్రచారం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు బ్రహ్మాండం బాలనారాయణ, నక్కా పేరిరెడ్డి, పట్టణ మాజీ అధ్యక్షుడు మామిడి రమేష్‌కుమార్, యువ మోర్చా అధ్యక్షుడు నాళం నరేష్, సీనియర్ నాయకులు బి.బాబునాగేంద్ర, నరాలశెట్టి శ్రీనివాస్, గుగ్గిలం శ్రీను, నటరాజన్ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు బంగారుబాబు, మైనార్టీ విభాగం జిల్లా కన్వీనర్ కరీముల్లా, షేక్ నూర్జహాన్

## నేడు ధరిత్రి దినోత్సవం

బాపట్ల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని సరస్వతీ మెమోరియల్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో మంగళవారం ఉదయం 10 గంటలకు ధరిత్రి దినోత్సవం నిర్వహిస్తున్నట్లు ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ పీసీసాయిబాబు తెలిపారు. ఈ సదస్సుకు జిల్లా అటవీశాఖాధికారి ఎల్.భీమయ్య ముఖ్యఅతిథిగా పాల్గొంటారన్నారు. మానవులకు ఉన్న మాదిరిగానే భూమాతకు కూడా అనేక హక్కులున్నాయని వాటిని గుర్తించి పరిరక్షించాల్సిన బాధ్యత మానవాళిపై ఉందనే అంశంపై ప్రసంగించటం జరుగుతుందన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్వాడ పక్షోత్సవాలు



చిన్నారులకు అన్నప్రాసన నిర్వహిస్తున్న ఎంపీడీవో ఎ.శ్రీనివాసరావు

కర్లపాలెం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం మండలపరిషత్ కార్యాలయంలో 7వ పోషణ పక్వాడ పక్షోత్సవాలు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన, 36 నెలల పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలలో చేర్చుకొని పేర్లను నమోదు చేసుకోవటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ పిట్ల వేణుగోపాలరెడ్డి, ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు, వైద్యులు గోపినాథ్, ప్రధానోపాధ్యాయులు పి.భాస్కర్‌రెడ్డి, నాగమల్లేశ్వరి, సూపర్‌వైజర్లు కె.శేషుకుమారి, సౌజన్య, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

● కర్లపాలెం మండలం దమ్మనవారిపాలెం గ్రామంలో స్వచ్ఛంధ్రా-స్వచ్ఛదివాస్ కార్యక్రమంలో భాగంగా పిట్టలవానిపాలెం మండలంలోని 14 గ్రామపంచాయతీలోని కార్యదర్శులకు, పారిశుధ్య కార్మికులకు పరిసరాల పరిశుభ్రతపై ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

## సూపర్‌సిక్స్ హామీలు అమలు చేయాలి : సీపీఐ

బాపట్ల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసి ఉమ్మడి జిల్లా సహాయ కార్యదర్శి మేకల ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ విషయమై సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలోని ఏవోకు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ యువతకు 20 లక్షల మందికి ఉపాధి అవకాశాలు, నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి, విద్యార్థులకు రూ.15 వేల చొప్పున నగదు, ఉజ్వల్ పథకం కింద గ్యాస్ కనెక్షన్‌లు ఇవ్వాలన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం వంటి హామీలన్నిటిని అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రగతిశీల యువజన సంఘం నాయకులు ఎన్.బిబ్బాన్, తరుణ్, హాఫీజుల్లా పాల్గొన్నారు.

## రిక్షాపుల్లర్ మస్తాన్ మృతి

బాపట్ల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని సూర్యలంక రోడ్డులో సన్ అండ్ శాండ్ బార్ ఎదురు రిక్షాపుల్లర్ షేక్ మస్తాన్ మృతి చెందిన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మస్తాన్ సినిమా వాల్‌పోస్టర్‌లు అంటిస్తూ రిక్షా తొక్కుతూ జీవనం సాగిస్తుంటాడు. భార్య,బిడ్డలు, కుటుంబ సభ్యులు ఎవరులేరు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు.

## లేఅవుట్‌ల క్రమబద్ధీకరణలో నిబంధనలు పాటించాలి

● కలెక్టర్ జె.వెంకటమురళి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జె.వెంకటమురళి, చిత్రంలో ఎమ్మెల్యే నరేంద్రవర్మ, బావుడా చైర్మన్ రాజశేఖర్‌బాబు

బాపట్ల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : లేఅవుట్‌ల క్రమబద్ధీకరణలో నిబంధనలు పాటించాలని కలెక్టర్ జె.వెంకటమురళి అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటి పరిధిలోని అక్రమ లేఅవుట్‌లపై సంబంధితాధికారులతో కలెక్టర్ ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ సలగల రాజశేఖర్‌బాబు పాల్గొన్నారు. 2019 సంవత్సరం నుంచి బాపట్ల మున్సిపాలిటి, అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలోని అక్రమ లేఅవుట్‌లను గుర్తించి వివరాలు తెలపాలని ప్రభుత్వం ఆదేశించినట్లు ఆయన వివరించారు. బావుడా పరిధిలోని 9 మండలాలలో 183 అక్రమ లేఅవుట్‌లను గుర్తించి వాటి వివరాలను డీటీసీపీకి పంపటమైనదని, వివరాలను పత్రికలలో ప్రచురించి ప్రజలకు అవగాహన కల్పించటం జరిగిందన్నారు. అందులో 86 లేఅవుట్‌లను 22ఎ కింద గుర్తించి రిజిస్ట్రేషన్ కాకుండా చర్యలు తీసుకోవాలని కమిషనర్ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్‌కు పంపటమైనదన్నారు. మిగిలిన లేఅవుట్‌లను సబ్‌డివిజన్‌లుగా చేసి పంపామని వాటిని తిప్పి పంపారని కలెక్టర్‌కు వివరించారు. 183 లేఅవుట్‌లు క్రమబద్ధీకరణకు సాధ్యాసాధ్యాలపై కలెక్టర్ అధికారులను ఆరా తీశారు. కొత్త లేఅవుట్‌ల అనుమతులకు వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో నిశితంగా పరిశీలించి నిబంధనల మేరకు అనుమతులు మంజూరు చేయాలని అధికారులకు సూచించారు. ల్యాండ్ కన్వర్షన్, ఇంటి నిర్మాణాలకు సంబంధించి మున్సిపాలిటి, బావుడా, పంచాయతీ పరిధిలోని నిబంధనలను ప్రజలకు అర్థమయ్యే విధంగా తయారు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. లేఅవుట్‌ల క్రమబద్ధీకరణ ఆలస్యమౌతుందని, తద్వారా ప్రభుత్వానికి వచ్చే రాబడి తగ్గుతుందని బాపట్ల అభివృద్ధికి ఆటంకం కలుగుతుందని, వాటిని వీలైనంత త్వరలో నిబంధనల మేరకు క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ సూచించారు. సమావేశంలో బావుడా చైర్మన్ సలగల రాజశేఖర్‌బాబు, డీఆర్వో డి.గంగాధర్‌గౌడ్, డీపీవో ప్రభాకర్, ఆర్డీవో పి.గ్లోరియా, మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి, బావుడా ప్లానింగ్ అధికారి షేక్.కాలేషా తదితరులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరించి సమస్యలు అడిగితెలుసుకుంటున్న ఆర్డీవో పి.గ్లోరియా

## ప్రజాసమస్యలను తక్షణమే పరిష్కరించండి : ఆర్డీవో

బాపట్ల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే ప్రతి అర్జీని త్వరితగతిన పరిష్కరించాలని ఆర్డీవో పి.గ్లోరియా తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కారవేదికకు వివిధ ప్రాంతాలు నుంచి వచ్చిన వారి అర్జీలను స్వీకరించి సమస్యను అడిగి తెలుసుకున్న ఆర్డీవో వాటిని ఆయాశాఖల అధికారులకు అందజేసి విచారించి త్వరితగతిన వాటిని పరిష్కరించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

## ప్రజాసమస్యల పరిష్కార వేదికకు మూడు అర్జీలు

రేపల్లె, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ప్రజాసమస్యల పరిష్కార వేదికను డివిజన్‌లోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీవో రామలక్ష్మి అన్నారు. ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు మూడు అర్జీలు అందాయి. ఆమె మాట్లాడుతూ మండలంలోని నల్లూరు గ్రామానికి చెందిన దివి హరికృష్ణ ఇంటిస్థలం ఆక్రమణ జరిగిందని, విచారించి ఆక్రమణను తొలగించాలని కోరారు. నిజాంపట్నం మండలం ప్రజ్ఞం గ్రామానికి చెందిన స్వామిసుబ్రహ్మణ్యంకు చెందిన ఇంటి నివేసన స్థలంలో సీసీ రోడ్డు నిర్మాణం జరిగిందని, తనకు నష్టపరిహారం మంజూరు చేయించాలని కోరారు. అడవులదీవి గ్రామానికి చెందిన షేక్ జిలాని తమ భూమిని ఆన్‌లైన్ చేయాల్సిందిగా కోరుతూ అర్జీ దాఖలు చేశారు. ఈ విషయాలను పరిశీలించి సత్వరమే పరిష్కరిస్తామని తెలిపారు.

## జాతీయ స్థాయిలో అభిలాస్య ప్రతిభ



ప్రతిభ కనబరిచిన విద్యార్థినికి ల్యాప్‌టాప్ అందజేస్తున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ

బాపట్ల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఆర్గనైజేషన్ వారు జాతీయ స్థాయిలో నిర్వహించిన పరీక్షలో బాపట్ల శ్రీనివాసనగర్ కాలనీ శ్రీచైతన్య స్కూల్ విద్యార్థిని ఆట్ల అభిలాస్య అత్యుత్తమ ప్రతిభను కనబరిచింది. గ్రాండ్ ప్రైజ్‌గా అభిలాస్యకు ల్యాప్‌టాప్ బహుకరించారు. సోమవారం ల్యాప్‌టాప్‌ను ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ చేతుల మీదుగా విద్యార్థినికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎజీఎం అంజయ్య, ఆర్ఐ అప్పాజి, ప్రిన్సిపాల్ అరుంధతిదేవి, కోఆర్డినేటర్ గోపిచంద్, డీన్ శివకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చలివేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యే వేగేశన

బాపట్ల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పాతబస్టాండ్ వద్ద టీడీపీ నాయకుడు కనమాల నాగరాజు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ సోమవారం పార్టీశ్రేణులతో కలిసి ప్రారంభించారు. వేసవిలో ప్రయాణికులు, పాదచారుల సౌకర్యార్థంగా దీనిని ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు మందపాటి ఆంద్రేయ, భోగిరెడ్డి రమేష్‌రెడ్డి, పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి పల్లం సరోజినీ, జీవన్, కార్యదర్శి కూచిపూడి ఝాన్సీరాణి, దగ్గుమల్లి కిరణ్‌కుమార్, పేరలి ధనుంజయ, శ్రీనివాసరావు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## బురకాయలంకమ్మతల్లి దేవాలయ విగ్రహ ప్రతిష్ఠ

పిట్టలవానిపాలెం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ఆధ్యాత్మిక చింతనతో భక్తులకు భక్తిభావన అలవడుతుందని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు. పిట్టలవానిపాలెం గ్రామపంచాయతీలోని డేగలవారిపాలెం గ్రామంలో సోమవారం నూతనంగా బురకాయలంకమ్మతల్లి దేవాలయ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. తొలుత డేగలవారిపాలెం గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యే నరేంద్రవర్మకు స్థానిక టీడీపీ మండల నాయకులు, నిర్వాహకులు, మహిళలు, గ్రామ పెద్దలు ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఎండీ అఫ్జల్, టీడీపీ నాయకులు లక్కంరాజు వెంకటపతిరాజు, గోకరాజు నరసరాజు, డేగల శ్రీనివాసరెడ్డి, ఏడుకొండలురెడ్డి, సుబ్బారెడ్డి, గ్రామపెద్దలు, చందోలు గ్రామ టీడీపీ యువ నాయకులు సయ్యద్ నిజాం, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## రఘురామయ్యకు ఎమ్మెల్యే నివాళి

బాపట్ల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు తోట నారాయణరావు సోదరుడు తోట రఘురామయ్య మృతి పార్టీకి తీరనిలోటు అని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు. పట్టణంలోని కొత్రావారి వీధికి చెందిన రఘురామయ్య మృతి చెందటంతో సోమవారం ఎమ్మెల్యే ఆయన భౌతికకాయాన్ని సందర్శించి పుష్పాంజలి ఘటించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపి పార్టీ అండగా ఉంటుందని భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కావూరి శ్రీనివాసరెడ్డి, మందపాటి ఆంద్రేయ, తోట నారాయణరావు, అంకాల శ్రీనివాసరావు ఉన్నారు.

## ముగిసిన కుట్టు శిక్షణ తరగతులు

భట్టిప్రోలు (కొల్లూరు) ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : కుట్టు శిక్షణ కేంద్రంలో మొదటి విడత మహిళలకు శిక్షణ ముగిసినట్లు భట్టిప్రోలు ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులు శ్రీనివాసరావు తెలిపారు. బీఎఫ్ఎ ఆధ్వర్యంలో ఈ ఏడాది జనవరిలో మహిళలకు కుట్టుశిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. బొలిశెట్టి జయబాబు సహాయ సహకారాలతో 10 మంది మహిళలకు సోమవారం శిక్షణ పూర్తి కావడంతో ఆయా మహిళలకు శిక్షణ పొందిన ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కె.సత్యనారాయణ, సభ్యులు ఆదినారాయణ, బాబూజీ, శివరాంప్రసాద్, వెంకట్రావు, మధు, శిక్షకురాలు నాగమణి పాల్గొన్నారు.

## వివాదాస్పద స్థలాలు పరిశీలించిన ఆర్డీవో

వేమూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : వేమూరు, జంపని గ్రామాల్లో వివాదాస్పదంగా ఉన్న స్థలాలను రేపల్లె ఆర్డీవో రామలక్ష్మి సోమవారం సాయంత్రం పరిశీలించారు. వేమూరుకు చెందిన తాళ్లూరి మోహనకృష్ణ తన కుటుంబ సభ్యులకు సంబంధించిన స్థల వివాదంపై అర్జీ దాఖలు చేశారు. దానిపై ఆర్డీవో పరిశీలన జరిపారు. అనంతరం జంపని గ్రామంలో కుమ్మరికుంట స్థలాన్ని సందర్శించారు. స్థలం కుమ్మరి కులస్థులకు చెందినదని దానిని ఆక్రమించుకుని నిర్మాణం చేసుకున్న వారందరిని తొలగించాలని కోర్టు ఆదేశాలు జారీ చేసినప్పటికీ దీనిపై గ్రామ పంచాయతీ ఎందుకు చర్యలు తీసుకోలేదని అధికారులను ప్రశ్నించారు. రెండు వివాదాస్పద స్థలాలపై కలెక్టర్‌కు నివేదిక సమర్పించనున్నట్లు పేర్కొన్నారు. ఆమె వెంట తహసీల్దార్ సుశీల, ఆర్ఐ సాయి, వీఆర్వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు.



వివాదాస్పద స్థలాలకు సంబంధించిన సర్వే రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీవో రామలక్ష్మి

## దెబ్బతిన్న పైపులైను.. తాగునీటి సరఫరాకు అంతరాయం

భట్టిప్రోలు (కొల్లూరు) ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : పైపు లైను దెబ్బతినడంతో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడినట్లు సర్పంచ్ దారా రవికిరణ్మయి సోమవారం తెలిపారు. భట్టిప్రోలులోని 6, 7 వార్డులలో వెల్లటూరు కాల్వ కట్ట మెయిన్ పైపు లైను దెబ్బతినడంతో సాగునీటి సరఫరాకు రెండు రోజులు పాటు అంతరాయం ఏర్పడుతుందని సర్పంచ్ తెలిపారు. పంచాయతీ సిబ్బంది పైపులైను మరమ్మతు పనులు ప్రారంభించారని, ఆయా పనులను కార్యదర్శి కోటా శ్రీనివాసరావు ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ పర్యవేక్షిస్తారన్నారు. దళితవాడలోని సంపు, వాటర్ ట్యాంకు, అద్దేపల్లి వాటర్ ట్యాంకు, కొత్త ట్యాంకుల వద్ద తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని ప్రజలు గమనించి సహకరించాలని సర్పంచ్ కోరారు.

## కార్మికుల సమస్యల పరిష్కరించాలి

రేపల్లె, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం నుంచి ఆమరణ దీక్ష చేపడుతున్నట్లు ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యులు వి.నాగాంజనేయులు తెలిపారు. మున్సిపల్ కార్యాలయం వద్ద పారిశుధ్య కార్మికులు, ఏఐటీయూసీ నాయకులు సమస్యలు పరిష్కరించాలంటూ సోమవారం ధర్నా నిర్వహించారు. సీపీఐ రేపల్లె ఏరియా కార్యదర్శి గొట్టుముక్కల బాలాజీ మాట్లాడుతూ కార్మికుల పట్ల అధికారులు వేధింపులు మానుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ నాయకులు సిరంశెట్టి శ్రీనివాసరావు, చుక్కాకుల శివశంకర్, రామకృష్ణ, వేణు, కుసుమ, గంగా పాల్గొన్నారు.

## నేడు నగరం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

నగరం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం ఉదయం 11గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో బొర్రా శ్రీనివాసరావు అన్నారు. ఈ సమావేశానికి మండలంలోని 27 గ్రామపంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు హాజరుకావాలని తెలిపారు. అలాగే అధికారులు తమశాఖలకు సంబంధించి అభివృద్ధి పనుల వివరాలతో పూర్తిగా సిద్ధంగా ఉండాలని, సమావేశానికి సమగ్ర నివేదికలతో హాజరుకావాలని ఎంపీడీవో సూచించారు. మండల స్థాయిలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించినట్లు ఆయన తెలిపారు.

## ఒకేషనల్ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ సర్టిఫికెట్లు పంపిణీ

వేమూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జంపని జడ్పీ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి ఒకేషనల్ విద్యార్థులకు సోమవారం ప్రధానోపాధ్యాయిని భాగ్యమ్మ ఇంటర్న్‌షిప్ సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. 2024-25 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన 15 మంది విద్యార్థులకు వృత్తి విద్యలో భాగంగా ఎలక్ట్రానిక్స్, ఆటోమెటివ్ రంగంలో ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. శిక్షణ అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఒకేషనల్ ఉపాధ్యాయులు పుష్పలత, సత్యనారాయణ, పాఠశాల ఉపాధ్యాయులు హాజరయ్యారు.

## సైన్స్ ఎక్స్‌పోజర్ విజిట్‌కు బాపట్ల విద్యార్థులు

బాపట్ల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల జిల్లా విద్యాశాఖ, సమగ్రశిక్ష ఆధ్వర్యంలో జిల్లాలోని ఉన్నత పాఠశాల విద్యార్థులను సైన్స్ ఎక్స్‌పోజర్ విజిట్‌కు తీసుకెళ్ళారు. అందులో భాగంగా సోమవారం కేంద్రపాలిత ప్రాంతమైన యానంను విద్యార్థులు సందర్శించారు. మడ అడవులు, ఫెర్రిరోడ్డు, బోటానికల్‌గార్డెన్, మోడల్ విపుల్ టవర్‌లను సందర్శించారు. సమగ్రశిక్ష ఏఎంవో డాక్టర్ బిళ్లా మోజెస్, జిల్లా సైన్స్ అధికారి ఎండీ సాధిక్, కర్లపాలెం, నిజాంపట్నం మండల విద్యాశాఖాధికారులు ఎన్.విజయశ్రీ, శేషుగోపాలం పాల్గొన్నారు.

## రామచంద్రాపురం సీఆర్‌జెడ్ సమస్యలను పరిష్కరించాలి

అడవిపంచాయతీలోని రామచంద్రాపురం గ్రామంలో 200 కుటుంబాల మత్స్యకారులు బోట్‌లు పెట్టుకునే భూవివాద సమస్యను ఎమ్మెల్యే నరేంద్రవర్మకు వివరించారు. ప్రైవేట్ రిసార్ట్స్ వ్యాపారుల ప్రయోజనాల కోసం తమ బతుకులు బలిపెట్టవద్దని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. సమస్యను పరిశీలించి తమకు న్యాయం చేయాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసి ఉమ్మడి గుంటూరు జిల్లా సహాయ కార్యదర్శి మేకల ప్రసాద్ కోరారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే సమస్యను చర్చించి పరిష్కరిస్తానని హామీనిచ్చారు.

## దొంగిలించిన సొమ్ము రికవరీ చేయించాలని వినతి

బాపట్ల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని వింజమూరివారి తోటకు చెందిన సుద్దపల్లి హేమలత ఇంట్లో గత ఏడాది అక్టోబరు 16న దొంగలు అపహరించిన సొత్తును రికవరి చేసి ఇప్పించాలని సోమవారం ప్రజా సమస్యల పరిష్కారవేదికలో ఎస్పీ తుషార్ డూడిని కలిసి విజ్ఞప్తి చేశారు. దొంగతనం చేసిన వ్యక్తులను విజయవాడ పోలీసులు అదుపులోకి తీసుకొని ఆయా ప్రాంతాలలో అపహరించిన సొత్తును రికవరి చేసినట్లు తెలిసిందన్నారు. దొంగలను విచారించి తమ సొత్తు కూడా ఇప్పించాలని ఆమె ఎస్పీకి విజ్ఞప్తి చేశారు.





అభ్యుదయ రైతు శ్రీమన్నారాయణను సన్మానిస్తున్న ఏడీఏ విజయబాబు తదితరులు

## రైతులు దేశవాళి విత్తనాలకు ప్రాధాన్యమివ్వాలి

రేపల్లె, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : పశువులను వ్యవసాయంలో అనుసంధానం చేస్తూ రైతులు సొంత విత్తనాలు, దేశవాళి విత్తనాలకు ప్రాధాన్యత ఇవ్వాలని వ్యవసాయ శాఖ ఏడీఏ ఆర్.విజయబాబు అన్నారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో రైతు సాధికారసంస్థ ఆధ్వర్యంలో సోమవారం ఆంధ్రప్రదేశ్ ప్రకృతి వ్యవసాయ విభాగం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జవ ఉత్పత్తే రకాలుగా ఉపయోగించే నేలలోని సూక్ష్మజీవులను ప్రేరేపించటం ద్వారా, కషాయాలను వాడటం ద్వారా భూమి సారవంతం అవుతుందని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం చేయటం వల్ల వ్యవసాయ పెట్టుబడులను తగ్గించుకుని నికర ఆదాయం పెంచుకోవచ్చన్నారు. ఉప్పుడి అభ్యుదయ రైతు శ్రీమన్నారాయణను దుశ్శాలువాల తో సన్మానించారు. కార్యక్రమంలో ఎన్.వరదానమ్మ, ఎ.ప్రసాద్, పి.వినయ్, మండలంలోని యానిమేటర్లు పాల్గొన్నారు.

## ఆంగ్ల ఉపాధ్యాయుడు హరికృష్ణ ఆదర్శప్రాయుడు : ఎంఈవో

భట్టిప్రోలు (కొల్లూరు) ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ఆంగ్ల ఉపాధ్యాయుడు పి.హరికృష్ణ గ్లోబల్ టీచర్‌గా ఎంపికై ఇతర పాఠశాలలకు ఆదర్శప్రాయుడిగా నిలిచారని ఎంఈవో దేవరాజు అన్నారు. ఐలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హరికృష్ణను ఉపాధ్యాయులు, గ్రామస్తులు సోమవారం ఘనంగా సత్కరించారు. దేవరాజు మాట్లాడుతూ, 2017 నుంచి ఈ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తూ విద్యార్థులను ఉన్నత స్థాయికి చేర్చేందుకు విశేష కృషి చేశారని, 2023 గ్లోబల్ టీచర్ ప్రైస్ ఫైనలిస్టుగా ఎంపికయ్యారన్నారు. స్కైప్, జూమ్, వీడియో కమ్యూనికేషన్‌ల ద్వారా ఇతర దేశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులతో సంభాషించేలా విద్యార్థులను ప్రోత్సహించారన్నారు. నాసా శాస్త్రవేత్తలతో వీడియో కాల్ ద్వారా తమ విద్యార్థులను అనుసంధానం చేసి విజ్ఞాన చర్చలకు వేదిక అందించారని కొనియాడారు. ఇక్కడ నుంచి ఆయన బదిలీ కావడం విద్యార్థులకు తీరని లోటని చెప్పారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎం.మోహనరావు, కాటూరి లక్ష్మీనారాయణ, అనగాని ఏడుకొండలు, పంచుమర్తి దుర్గాదేవి, మాచర్ల నాగరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయుడు హరికృష్ణను సన్మానిస్తున్న ఎంఈవో తదితరులు

## బాల్య వివాహాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

కర్లపాలెం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహాలు ఎక్కడైనా జరుగుతున్నట్లు తెలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మండల స్థాయి అధికారులకు తహసీల్దార్ సుందరమ్మ తెలిపారు. కర్లపాలెం మండల పరిషత్ కార్యాలయ సమావేశం హాలులో బాల్య వివాహాలపై ఉపాధ్యాయులు, కార్యదర్శులు, అంగన్‌వాడీ కార్యకర్తలకు సోమవారం ఆమె అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు, పీహెచ్‌సీ వైద్యులు గోపినాథ్, జడ్పీటీసీ పిట్ల వేణుగోపాలరెడ్డి, ఎంఈవో మనోరంజని, ప్రధానోపాధ్యాయులు విజయభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నేడు బీజేపీ జిల్లా అధ్యక్షుడి ప్రమాణస్వీకారం

బాపట్ల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కాపు కల్యాణ మండపంలో మంగళవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన కొండమూది బంగారుబాబు ప్రమాణస్వీకారోత్సవం జరుగుతుందని పార్టీ శ్రేణులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆదోనీ బీజేపీ ఎమ్మెల్యే పార్థసారథి, మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్ ముఖ్యనాయకులు హాజరవుతారన్నారు. పార్టీశ్రేణులంతా తరలిరావాలని పిలుపునిచ్చారు.

## 24న ఉమ్మడి జిల్లా బీచ్ కబడ్డీ జట్టు సెలక్షన్స్

బాపట్ల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి గుంటూరు జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో పురుషులు, స్త్రీల 12వ బీచ్ కబడ్డీ సెలక్షన్స్ ఈనెల 24వ తేదీన బాపట్ల మున్సిపల్ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో జరుగుతాయని అసోసియేషన్ జిల్లా కార్యదర్శి మంతెన సుబ్బరాజు తెలిపారు. ఈ సెలక్షన్స్‌లో పాల్గొనే క్రీడాకారులు తప్పనిసరిగా ఆధార్‌కార్డు తీసుకొనిరావాలన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు సెలక్షన్స్ జరుగుతాయన్నారు. ఎంపికైన క్రీడాకారులు అంతర్ జిల్లాల పోటీలలో ఉమ్మడి గుంటూరు జిల్లా తరుపున పాల్గొంటారన్నారు.

## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం


చుండూరు, (వేమూరు) ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తొట్టెంపూడి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సానుభూతిపరురాలు అయిన ఐరా అన్నమ్మ సోమవారం అనారోగ్య కారణాలతో మరణించారు. మరణ వార్త తెలుసుకున్న ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు సూచనలతో బండ్లమూడి వీరేంద్ర యూత్ ఆధ్వర్యంలో రూ.5 వేలు మట్టి ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో తొట్టెంపూడి గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని అన్నమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

# సంక్షోభంలో.. నాపరాయి క్వారీలు



గ్రానైట్ రాకతో ఆదరణ కోల్పోయిన పరిస్థితి

ఉపాధి కోల్పోతున్న కార్మికులు



గోలిలోని నాపరాయి క్వారీ

మాచర్లటౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): పల్నాడులోని రెంటచింతల, గోలి, తుమృకోట, మల్లవరం, పశర్లపాడు, జెట్టిపాలెం, మాచర్ల, రాయవరం, మండాది, రచ్చమలపాడు, శ్రీరాంపురంతండా, బోదలవీడు గ్రామాల పరిధిలో నాపరాయి క్వారీలకు ప్రసిద్ధి. ఎంతో మందికి ఉపాధిని కల్పించిన ఈ నాపరాయి క్వారీలు కాలక్రమంలో ఆదరణ కోల్పోయాయి. ఈ క్వారీల వలన లారీ ట్రాన్స్‌పోర్టు, కూలీలకు మంచి ఉపాధి లభించేది. పల్నాడులో ఒకప్పుడు అత్యంత ఉపాధి కల్పించిన ఈ నాపరాయి క్వారీలు నేడు గ్రానైట్, యుట్రిఫైడ్ టైల్స్, వాల్ పేపర్లు రాకతో పూర్తిగా మరుగున పడిపోయి సంక్షోబాన్ని ఎదుర్కొంటున్నాయి. దీంతో దానిపై ఆధారపడి జీవించే డ్రైవర్లు, ఓనర్లు, కూలీలు దీన స్థితిలోకి వెళ్లిపోయే పరిస్థితి నెలకొంది.



## గ్రానైట్స్ రాకతో...

మొదట్లో రాళ్లను చేతులతో తొలిచి మొలలు ద్వారా రాళ్లను చిన్నసైజు చేసేవారు. నాపరాయి పరిశ్రమ నుంచి రవాణాకు ఎద్దుల బండ్లను కూడా వాడేవారు. కాలక్రమేణా లారీలు, ట్రాక్టర్లు రావడంతో రాళ్లను సులభతరంగా తీసి రవాణా చేస్తున్నారు. నిత్యం నాపరాయి లోడింగ్, అన్‌లోడింగ్‌తో మూడు పూలు, ఆరు కాయలుగా పరిశ్రమ అభివృద్ధి చెందింది. కానీ నేడు ఆ పరిస్థితి భిన్నంగా ఉంది. వ్యాపారాలు లేక పరిశ్రమలు మూతపడుతున్నాయని వ్యాపారస్తులు ఆవేదన చెందుతున్నారు. వారం వచ్చిందంటే చాలు కూలీల ఖర్చులకు కూడా రావడం లేదని వాపోతున్నారు. ప్రస్తుతం గ్రానైట్, టైల్స్ వ్యాపారం అధికంగా ఉండడంతో నాపరాయి పరిశ్రమకు గడ్డు పరిస్థితులు ఏర్పడుతున్నాయన్నారు. వ్యాపారాలు సన్నగిల్లడంతో యజమానులు, కూలీలు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేపట్టిన అమరావతి రాజధాని నిర్మాణంలో నాపరాయిని వినియోగిస్తే తమకు మేలు జరుగుతుందని వ్యాపారస్తులు, కూలీలు పేర్కొంటున్నారు.



# దాతృత్వానికి తిలోదకాలు

● మూతపడ్డ చావలి ఆయుర్వేద ఆసుపత్రి ● దెబ్బతింటున్న భవనం, రికార్డులు... సామగ్రి

వేమూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): దాతల దాతృత్వానికి తిలోదకాలు ఇస్తున్నారు అనడానికి చావలి ప్రభుత్వ వైద్యశాల భవనమే తార్కాణం. గ్రామంలో రెండేళ్ల క్రితం మూతపడ్డ ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలను తిరిగి ప్రారంభించేందుకు ఏ ఒక్కరూ ముందుకు రావడం లేదు. సంబంధించిన అధికారులు, ప్రజా ప్రతినిధులు కూడా దీనిపై దృష్టి పెట్టడం లేదు. దీంతో భవనం చుట్టూ పిచ్చి మొక్కలు మొలచి శ్లాబ్, గోడలు దెబ్బతింటున్నాయి. ఆసుపత్రి లోపల ఉన్న రికార్డులు, సామగ్రి పాడైపోతున్నాయి. 1982లో ఆయుర్వేద వైద్యశాల నిర్మాణం కోసం గ్రామానికి చెందిన గాజుల మహాలక్ష్మమ్మ అమర్తలూరు పంచాయతీ సమితి ద్వారా స్థలాన్ని దానంగా ఇచ్చారు. నాటి హోంశాఖ మంత్రి కొణిజేటి రోశయ్య భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. 1985లో అప్పటి జెడ్పీ ఛైర్మన్ సక్కుర్తి రామయ్య వైద్యశాల భవనాన్ని ప్రారంభించారు. నాటి నుండి ప్రభుత్వ పర్యవేక్షణలో గ్రామస్తులకే కాకుండా చుట్టు పక్కల గ్రామాల వారికి ఆయుర్వేద వైద్య సేవలు 2022 వరకు అందాయి.

## వైద్యశాలకు ప్రజాదరణ

ప్రతిరోజు రోగుల సంఖ్య 100కు పైగానే ఉండేది. దానికి తగ్గట్టుగానే ఆసుపత్రి సేవలను గుర్తించిన ప్రభుత్వం మందులను కూడా ఎప్పటికప్పుడు సరఫరా చేస్తూ ఉండేది. 2022లో ఇక్కడ పని చేసే సిబ్బందిని బదిలీ చేశారు. ఆ తర్వాత నియామకం జరగలేదు. కేంద్ర ప్రభుత్వ పర్యవేక్షణలోని ఆయుష్ విభాగంలోని ఉన్నతాధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు కొనసాగినంత వరకు సేవలు పొందారు. ఇక్కడ పని చేసిన వైద్యులకు ప్రజాదరణతో పాటుగా ప్రభుత్వం నుంచి అవార్డులు కూడా అందాయి. ప్రస్తుత వైద్యశాల దుస్థితిని చూసి గ్రామస్తులు దాతల ఆశయాన్ని ప్రభుత్వం నీరుగారుస్తుందని, ఆయుర్వేద వైద్య సేవలు తమకు దూరం చేశారని విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు భవన నిర్మాణం మరమ్మతులు చేయించడంతో పాటు తక్షణమే ఆయుర్వేద వైద్యుడు, తగిన సిబ్బందిని నియమించి పూర్వ వైభవాన్ని తీసుకు రావాలని గ్రామస్తులు కోరుతున్నారు.



ఆయుర్వేద ఆసుపత్రి భవనంపై మొలచిన పిచ్చి మొక్కలు



చావలిలో మూతపడ్డ ఆయుర్వేద ఆసుపత్రి



కమిషనర్ నరసింహారెడ్డిని జ్ఞాపిక, శాలువాతో సత్కరిస్తున్న నూతన కమిషనర్ సుజిత్ మల్లిక్, అధికారులు

# సీజీఎస్టీ కమిషనర్ నరసింహారెడ్డి బదిలీ

● ఘనంగా వీడ్కోలు కార్యక్రమం

గుంటూరు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): సీజీఎస్టీ గుంటూరు కమిషనర్ సాధు నరసింహారెడ్డి బదిలీ అయ్యారు. రెండేళ్ల పాటు పనిచేసిన ఆయనను హైదరాబాద్‌లో అప్పీల్స్ కమిషనర్‌గా బదిలీ చేస్తూ ఆ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. గుంటూరు కన్నావారి తోటలో ఉన్న సీజీఎస్టీ కార్యాలయంలో కమిషనర్ నరసింహారెడ్డి వీడ్కోలు కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహారెడ్డి మాట్లాడుతూ డివిజన్‌లో ఉద్యోగులు అందించిన సమష్టి సహకారంతోనే రెవెన్యూ పరంగా సెంట్రల్ జీఎస్టీ శాఖను అగ్రస్థానంలో నిలబెట్టగలిగానని ఆనందం వ్యక్తం చేశారు. తన ఉద్యోగ జీవితంలో గుంటూరు కమిషనరేట్‌తో ఉన్న అనుబంధాన్ని ఎప్పటికీ మరువలేనన్నారు. అడిషనల్ కమిషనర్ బి.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కమిషనర్ నరసింహారెడ్డి ఉద్యోగ బాధ్యతలతో పాటు, సేవా తత్పరునిగా సమాజానికి ఎంతో మేలు చేశారని కొనియాడారు. అసిస్టెంట్ కమిషనర్ ఎం నాగరాజు, గెజిటెడ్ ఉద్యోగుల సంఘం నాయకులు కె.యుగంధర్, గాదె శ్రీనివాసరెడ్డి స్ఫూర్తి శాఖలో ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చిన అత్యంత అరుదైన ఐఆర్ఎస్ అధికారి నరసింహారెడ్డి అని పేర్కొన్నారు. అనంతరం ఉద్యోగులు కమిషనర్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ బి.రవికుమార్, సూపరింటెండెంట్లు నవీన్ రాజు, చిదెళ్ల ఈశ్వరరావు, చిట్టి వెంకటేశ్వరరావు, కాకర్ల శ్రీనివాస్, పూర్ణ సాయి పాల్గొన్నారు.

## నూతన కమిషనర్‌గా మల్లిక్, నేడు బాధ్యతల స్వీకారం

సీజీఎస్టీ గుంటూరు కమిషనర్‌గా సుజిత్ మల్లిక్‌ను నూతన కమిషనర్‌గా నియమించారు. భువనేశ్వర్‌లో సీజీఎస్టీ అడిషనల్ కమిషనర్‌గా వ్యవహరిస్తున్న ఆయన్ను ఉద్యోగోన్నతిపై గుంటూరు కమిషనర్‌గా బదిలీ చేశారు. మంగళవారం సీజీఎస్టీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించనున్నారు.

# రైల్వే కంబైన్డ్ రన్నింగ్ రూం ఆధునికీకరణ

● రూ.3.74 కోట్లు విడుదల చేసిన రైల్వే శాఖ
● కొత్తగా మరో 11 విశాంత్రి గదుల నిర్మాణం
● అంతటా త్రీస్టార్ సదుపాయాల కల్పన

గుంటూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రైల్వే కంబైన్డ్ రన్నింగ్ రూం ఆధునికీకరణకు రైల్వేబోర్డు నిధులు మంజూరు చేసింది. ఇక్కడికి విశ్రాంతి కోసం సికింద్రాబాద్, రాజమండ్రి, విజయవాడ, రేణిగుంట, గుంతకల్లు, నంద్యాల నుంచి డ్యూటీపై వచ్చిన లోకో, అసిస్టెంట్ లోకో పైలట్లు, ట్రైన్ మేనేజర్‌లు వస్తున్నందున.. వారికి సకల సదుపాయాలు కల్పించాలని రైల్వే బోర్డు ఆదేశించింది. ఈ మేరకు తరచుగా రైల్వే అధికారులు రన్నింగ్ రూంని సందర్శిస్తూ అక్కడ లభిస్తున్న సదుపాయాలను మెరుగుపరిచేందుకు చర్యలు చేపడుతున్నారు. ప్రస్తుతం 19 గదుల్లో 38 పడకలు ఉన్నాయి. కొత్తగా మంజూరు చేసిన 11 గదుల్లో 22 బెడ్స్ అదనంగా రాబోతున్నాయి. దీంతో ఏకకాలంలో 60 మంది సిబ్బంది విశ్రాంతి తీసుకొనే అవకాశం ఏర్పడుతుంది. రైల్వే బోర్డు స్థాయిలో 2012లో, దక్షిణ మధ్య రైల్వే జోనల్ లెవల్‌లో 2024లో ఉత్తమ రన్నింగ్ రూం అవార్డు కూడా గుంటూరుకు దక్కడం విశేషం.

## 8 గంటల విశ్రాంతి తప్పనిసరి

రైళ్లలో విధులు నిర్వహించే ఎల్‌పీ, ఏఎల్‌పీ, టీఎంలకు సరైన విశ్రాంతి ఉంటేనే వాళ్లు సురక్షితంగా ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరుస్తారని రైల్వేబోర్డు భావిస్తోంది. ఈ మేరకు ఎనిమిది గంటల కంటే ఎక్కువ సమయం డ్యూటీ నిర్వహించిన సిబ్బందికి గుంటూరు కంబైన్డ్ రన్నింగ్ రూంలో తగిన విశ్రాంతిని కల్పిస్తారు. గుంటూరు రైల్వేస్టేషన్‌లో దిగిన ఇతర డివిజన్ల సిబ్బంది మళ్లీ డ్యూటీ ఎక్కాలంటే కనీసం 8 గంటల విశ్రాంతి ఉండాలి. ఈ మేరకు రన్నింగ్ రూంలోని గదులన్నింటిని ఎయిర్ కండీషనింగ్ చేశారు. ఒక్కో గదిలో రెండు పడకలుండగా వాటికి దోమ తెరలను అమర్చారు. మహిళా సిబ్బందికి ప్రత్యేకించి రెండు గదులను కేటాయించి, వాటికే అటాచ్డ్ బాత్‌రూంలను ఏర్పాటు చేశారు. గీజర్, వాషింగ్ మెషిన్, ఐరన్ బాక్సు సదుపాయలను కూడా కూడా కల్పించారు. ఒక్క నిమిషం కూడా విద్యుత్ సరఫరా నిలిచిపోకుండా ఉండేందుకు ఆటోమేటిక్ బ్యాకప్ జనరేటర్‌ని ఏర్పాటు చేశారు. సోలార్ విద్యుత్‌ని కూడా వినియోగిస్తున్నారు.



కామన్ టాయిలెట్స్



వెయిటింగ్ హాల్



లాబీ, ఆటోమేటిక్ బ్యాకప్ జనరేటర్

## రీడింగ్ రూంలో దినపత్రికలు, పుస్తకాలు

లోకో పైలట్లు, ట్రైన్ మేనేజర్లు, అసిస్టెంట్ లోకో పైలట్లు పుస్తకాలు, దిన పత్రికలు చదువుకునేందుకు ఒక రీడింగ్ రూమ్‌ని ఏర్పాటు చేశారు. అక్కడ తెలుగు, హిందీ, ఆంగ్ల దిన పత్రికలు, వీక్లీ మ్యాగజైన్లు అందుబాటులో ఉంచుతున్నారు. అలానే పుస్తకాలు కూడా వారికి ఇస్తున్నారు. ధ్యానం చేసుకొనేందుకు ఒక మెడిటేషన్ హాల్‌ని కూడా ఏర్పాటు చేశారు.

### హైజినిక్ కిచెన్, డైనింగ్ హాల్

కోచింగ్ సిబ్బందికి నాణ్యమైన ఆహారాన్ని ఆరోగ్యకరమైన వాతా వరణంలో వడ్డించేందుకు హైజినిక్ కిచెన్, డైనింగ్ హాల్‌ని ఏర్పాటు చేశారు. ఒకేసారి 12 మంది సిబ్బంది రౌండ్ టేబుల్ చుట్టూత కూర్చుని భోజనం చేయొచ్చు. బ్రాండెడ్ సరుకులనే ఆహార పదార్థాల తయారీకి వినియోగిస్తున్నారు. రోజుకొక మెనూని నిర్ణయించి, ఈ మేరకు ఆహార పదార్థాలు వండి పెడుతున్నారు. త్వరలో కిచెన్, డైనింగ్ హాల్స్‌ని కూడా ఎయిర్ కండీషనింగ్ చేయనున్నారు. పరిశుభ్రమైన తాగునీటి కోసం ఆర్వో ప్లాంట్‌ని ఏర్పాటు చేశారు. అలానే తాగే నీరు చల్లగా ఉంచేందుకు కూలర్, వేడినీళ్లు కావాలనుకొనేవారికి ప్రత్యేక యంత్రం ఏర్పాటు చేశారు.

## సీసీ టీవీలతో పర్యవేక్షణ

రన్నింగ్ రూం అంతటా సీసీ టీవీలను అమర్చారు. గదుల్లో సిబ్బంది సక్రమంగా విశ్రాంతి తీసుకొంటున్నారా, ఏమైనా ఫోన్లు చూసుకొంటూ కాలం గడిపేస్తున్నారా అనేది కూడా పర్యవేక్షిస్తున్నారు. కారిడార్‌లో పిచ్చాపాటిగా తిరుగుతున్నారా అనేది కూడా చూస్తున్నారు. ఒకసారి లోనికి వచ్చిన తర్వాత ఎనిమిది గంటల విశ్రాంతి పూర్తి అయ్యేంత వరకు సిబ్బందిని బయటకు పంపించరు.

## పరీక్షల అనంతరం అవుట్ సోర్సింగ్ సిబ్బంది నియామకం

రన్నింగ్ రూంలో పని చేసే అవుట్ సోర్సింగ్ సిబ్బందిని నియమించుకునే ముందు రైల్వే మెడికల్ ఆఫీసర్ల ద్వారా వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. వాళ్లకు ఎలాంటి వ్యాధులు లేవని సర్టిఫికేట్ ఇస్తేనే విధుల్లోకి తీసుకొంటారు. అలానే ఎలాంటి నేర చరిత్ర లేదని పోలీసు శాఖ నుంచి ధ్రువీకరించుకొన్న తర్వాతే నియమిస్తారు.

# విభజన కష్టాలు

ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ (ఏపీ సీపీడీసీఎల్) లిమిటెడ్ సంస్థలోని కొత్త సర్కిల్స్ విభజన కష్టాలు ఇప్పట్లో తీరేలా కనిపించడం లేదు. సర్కిల్స్ విభజన జరిగి దాదాపు ఆరు నెలలు పైగా గడుస్తున్నా.. సమస్యలు మాత్రం వెంటాడుతూనే ఉన్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తొలినాళ్లలోనే ఏపీ సీపీడీసీఎల్‌లో సర్కిల్స్ విభజనకు శ్రీకారం చుట్టింది. గత ప్రభుత్వంలోనే చేయాల్సిన విభజన కేవలం ప్రతిపాదన దశలోనే ఉండగా.. కార్యరూపంలోకి తీసుకొచ్చింది.

◆ ఆర్నెల్ల క్రితం ఏపీ సీపీడీసీఎల్‌లో కొత్త సర్కిల్స్ ఏర్పాటు
◆ కొత్తకార్యాలయాలను వేధిస్తున్న ఉద్యోగుల కొరత, వసతులు
◆ ఉద్యోగుల సర్దుబాటుపై కసరత్తు, నెలాఖరుకు డెడ్‌లైన్
◆ ఔట్ సోర్సింగ్‌లో బదిలీలపై ఆందోళన
◆ నేతల సిఫార్సులతో తలలు పట్టుకుంటున్న అధికారులు


గుంటూరు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): సీపీడీసీఎల్ పరిధిలో కృష్ణా జిల్లా మచిలీపట్నంలో కొత్త సర్కిల్‌ను ఏర్పాటు చేశారు. ఇక ఉమ్మడి గుంటూరు సర్కిల్‌లో కొత్తగా పల్నాడు సర్కిల్, బాపట్ల సర్కిల్ కార్యాలయాలను ఏర్పాటు చేశారు. ఇప్పటికే సర్కిల్స్‌కు ఎస్ఈలను, ఈఈలను ప్రభుత్వం నియమించింది. ప్రైవేటు భవనాలను అద్దెకు తీసుకొని ఆయా సర్కిల్ కార్యాలయాలను ఏర్పాటు చేశారు. అయితే నెలలుగా కార్యాలయాల్లో సరిపడా ఉద్యోగులు లేక కార్యకలాపాలు ముందుకు సాగే పరిస్థితి కనిపించటం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కనీసం ఆయా కార్యాలయాల్లో నెట్‌వర్క్ వంటి మౌలిక సదుపాయాలు పూర్తిస్థాయిలో కల్పించలేదని ఉద్యోగుల నుంచే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అయితే.. ఆరు నెలల తర్వాత ఆయా కార్యాలయాలకు ఉద్యోగులను సర్దుబాటు చేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు.

## విభజనపై విమర్శలు

ఇదిలా ఉంటే ప్రభుత్వం పరిపాలనా పరంగా జిల్లాలు, నైసర్గిక స్వరూపాల విభజనకు భిన్నంగా సీపీడీసీఎల్‌లో సర్కిల్స్ విభజన జరిగిందన్న విమర్శలు ఉన్నాయి. పల్నాడు జిల్లాలో ఉన్న చిలకలూరిపేట సబ్ డివిజన్ నేటికీ సీఆర్‌డీఏ సర్కిల్‌లోనే కొనసాగుతోంది. ఇక రేపల్లె సబ్ డివిజన్ బాపట్ల సర్కిల్ కు వెళ్లాల్సి ఉండగా నేటికీ గుంటూరు సర్కిల్‌లోనే కొనసాగుతోంది. ఇలా కొన్ని సబ్ డివిజన్‌లు, సెక్షన్‌లు పాత జిల్లాల పరిధిలోనే కొనసాగుతుండటంపైనా కొందరు అభ్యంతరాలు లేవనెత్తుతున్నారు.

## సర్దుబాటుపై కసరత్తు

ఇక ఉద్యోగుల సర్దుబాటు ప్రక్రియపై ఇప్పటికే కసరత్తు ప్రారంభమైంది. పలువురు జేఏసీలు, జూనియర్ అసిస్టెంట్లు, సీనియర్ అసిస్టెంట్లను కొత్త సర్కిల్స్‌కు బదిలీ చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. బదిలీ ప్రక్రియకు ఈ నెలాఖరు వరకు గడువు విధించినట్లు తెలిసింది. ఇప్పటికే అనేక మంది ఉద్యోగుల జాబితాను సిద్ధం చేశారు.





## బదిలీలపై ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఆందోళన

ఇక సర్కిల్ కార్యాలయాల్లో పనిచేసే పొరుగు సేవల (ఔట్ సోర్సింగ్) ఉద్యోగుల బదిలీలకు కూడా రంగం సిద్ధం చేయడం కొంత గందరగోళానికి దారితీస్తోంది. జిల్లా కేంద్రం గుంటూరు సర్కిల్ కార్యాలయంలో 31 మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఉంటే ఇందులో దాదాపు 15 మంది వరకు ఉద్యోగులను పల్నాడు సర్కిల్ కార్యాలయ కేంద్రం నరసరావుపేటకు బదిలీ చేసేందుకు జాబితాను సిద్ధం చేసినట్లు సమాచారం. ఇక కొత్తగా ఏర్పడిన బాపట్ల సర్కిల్‌కు కూడా ఒంగోలు సర్కిల్ కార్యాలయం నుంచి ఉద్యోగులను బదిలీ చేయాలని ఆదేశాలు ఉన్నాయి. దాంతో ఒంగోలు సర్కిల్ కార్యాలయంలో 33 మంది ఉద్యోగులు ఉంటే వారిలో పది మంది మందికి పైనే బాపట్లకు బదిలీ చేయాలని జాబితా సిద్ధం చేసినట్లు తెలిసింది. అసలే అరకొర జీతాలతో నెట్టుకొస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను బదిలీల జాబితాలో చేర్చడం అన్యాయమంటూ వారు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. వాస్తవానికి సాధారణ బదిలీల సమయాల్లో రెగ్యులర్ ఉద్యోగులకే ఈ ప్రక్రియ ఉంటుందని, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు బదిలీల విధానమే ఉండదని వారు గుర్తుచేస్తున్నారు. చాలీ చాలని వేతనాలతో కుటుంబాలను నెట్టుకొస్తుంటే జిల్లాలు దాటి ప్రయాణాలు చేయాలంటే వచ్చే జీతంలో సగం జీతం ఛార్జీలతో సరిపోతాయని వారు వాపోతున్నారు. కొందరు ఉద్యోగులు దశాబ్దాలుగా పనిచేస్తున్నా.. కనీస జీతాలు కూడా రావడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా, గుంటూరు సర్కిల్ కార్యాలయంలో బదిలీల జాబితాలో 70 శాతం మంది మహిళా ఉద్యోగులే ఉండటం విశేషం. మహిళా ఉద్యోగులు అత్యధికశాతం ఉండటంతో అధికారులకు కొంత ఇబ్బందికరంగా మారిందని చెబుతున్నారు.

## నేతల సిఫార్సులు

ఇక బదిలీల నుంచి తప్పించుకునేందుకు కొందరు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు అధికార పార్టీ నేతల నుంచి కూడా సిఫార్సులు చేయించుకుంటున్నారు. కొందరు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు చేస్తోన్న సిఫార్సులు ఏ స్థాయిలో ఉంటున్నాయంటే అధికారులే తలలు పట్టుకునే పరిస్థితి ఉందని ఓ అధికారి వ్యాఖ్యానించారు. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో 2018లో ఉమ్మడి గుంటూరు సర్కిల్ పరిధిలో గుంటూరు -2 డివిజన్, అమరావతి డివిజన్‌లను కలిపి కొత్తగా సీఆర్‌డీఏ సర్కిల్‌ను ఏర్పాటు చేశారు. ఆ సమయంలో సర్కిల్ కార్యాలయంలో పనిచేసేందుకు ఉద్యోగుల కోసం కొత్తగా నియామకాలను చేపట్టారు. ఇలా వేరొక సర్కిల్ నుంచి ఉద్యోగుల బదిలీల వ్యవహారం లేదని గుర్తు చేస్తున్నారు. డివిజన్ కార్యాలయాల్లో ఉన్న వారిని సర్దుబాటు చేసుకొని, సర్కిల్ కార్యాలయానికి కొత్తగా నియామకాలతో ఉద్యోగులను నియమించుకున్నారని, అటువంటి ప్రక్రియ వదిలేసి వేరొక జిల్లా నుంచి సిబ్బందిని బదిలీ చేయడం సరికాదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## వైసీపీ కీలక నేత అరెస్టుకు రంగం సిద్ధం?

**పోక్సో కేసులో ప్రమేయం ఉన్నట్లు గుర్తింపు**

చీరాల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : చీరాల పరిధిలోని ఓ వైసీపీ నేత అరెస్టుకు పోలీసులు రంగం సిద్ధం చేసినట్లు సమాచారం. పోక్సో కేసులో ప్రమేయం ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఓ మైనర్‌ను యువకుడు వేధించగా, అందులో ఆ నేత కీలకంగా వ్యవహరించి, యువకుడికి సహకారం అందించినట్లు తెలుస్తుంది. ఈమేరకు నమోదైన కేసులో యువకుడిని పోలీసులు ఇప్పటికే అరెస్టు చేయగా, వైసీపీ నేత, అతని అనుచరులు ఇద్దరు ఫోన్‌లు ఆఫ్ చేసుకుని పరారీలో ఉన్నట్లు తెలిసింది. అతని కోసం పోలీసులు గాలిస్తున్నారు.

## బెట్టింగ్‌తో అప్పుల పాలయిన భర్త

**తాళలేక భార్య సుమియా భాను బలవన్మరణం**

**వివాదాల్లో కూరుకుపోయిన కుటుంబం**

ఈపూరుపాలెం (చీరాల), ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : మూడేళ్ల పాప, మూడు నెలల బాబు. ఎంతో అన్యోన్యమైన కుటుంబంలో బెట్టింగ్ యాప్ విషాదాన్ని నింపింది. ఈపూరుపాలెం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈపూరుపాలెం పీర్ల చావిడి సమీపానికి చెందిన మొగల్ బాజీ లియాస్ బబ్లు. చినగంజాంకు చెందిన సుమియా భాను(21) దంపతులు. వీరికి మూడేళ్ల పాప, మూడు నెలల బాబు సంతానం. బాజీ ఆటో డ్రైవర్‌గా పని చేస్తూ బెట్టింగ్ యాప్‌కు బానిసగా మారాడు. ఈనేపథ్యంలో అప్పుల్లో కూరుకుపోవడంతో అనుకోని రీతిలో ఉన్న ఇంటిని అమ్మకం చేసి బాకీలు తేర్చే ప్రయత్నం జరిగింది. ఈక్రమంలో భార్యాభర్తల మధ్య వివాదం నెలకొంది. అవికాస్త తారస్థాయికి చేరడంతో ఆదివారంరాత్రి ఇంట్లో ఉరికి పాల్పడింది. వెంటనే భర్త స్థానికుల సహకారంతో చీరాలలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. పరీక్షలు నిర్వహించిన వైద్యులు అప్పటికే ఆమె మృతిచెందినట్లు తెలిపారు. సమాచారం అందుకున్న ట్రైనీ డీఎస్పీ అభిషేక్, సీఐ శేషగిరిరావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. సుమియాభాను తల్లి పఠాన్ ఫాతిమా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. భర్తను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు.

## ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్‌కు ఉద్యోగోన్నతి

అద్దంకిటౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): అద్దంకి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్న వంగపల్లి వెంకట సుబ్బారావును నెల్లూరు జిల్లా ఇంటర్ బోర్డ్ అధికారిగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ బాధ్యతతో పాటు రాష్ట్ర ఎగ్జామినేష్ కంట్రోల్‌గా అదనపు బాధ్యతలు అప్పగించింది.

## నిబద్ధత కలిగిన ఉపాధ్యాయుడు హనుమంతరావు



హనుమంతరావు దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఇంకొల్లు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : క్రమశిక్షణ, నిబద్ధత కలిగిన ఉపాధ్యాయుడు చిలుకూరి హనుమంతరావు ఆదర్శవంతుడని పలువురు ప్రముఖులు అన్నారు. మండలంలోని పావులూరు జడ్పీ ఉన్నత పాఠశాలలలో సైన్సు ఉపాధ్యాయుడిగా విద్యార్థులకు సేవలందించిన పెదనక్కలపాలెం గ్రామానికి చెందిన చిలుకూరి హనుమంతరావు ఉద్యోగ విరమణ సన్మాన సభ పాఠశాలలో సోమవారం జరిగింది. పాఠశాల అభివృద్ధికి ఆయన కృషిని కొనియాడారు. అనంతరం హనుమంతరావు దంపతులను ఉపాధ్యాయులు, బంధుమిత్రులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవోలు అజయ్‌బాబు, గోపి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ ఆర్‌ఎంగా సత్యనారాయణ

ఒంగోలు, కార్పొరేషన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ప్రకాశం జిల్లా రీజనల్ మేనేజరుగా సత్యనారాయణ నియమితులయ్యారు. ఈమేరకు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ తిరుమలరావు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన ఇప్పటివరకు విజయవాడ వర్క్‌షాప్ మేనేజరుగా ఉన్నారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న వెంకట్రావును తిరుపతి ఆర్‌ఎంగా బదిలీ చేశారు. అలాగే విజయవాడ ఆర్టీసీ విజిలెన్స్‌లో పనిచేస్తున్న ఘట్టమనేని శ్రీనివాసరావును ఒంగోలు కార్గో కొరియర్ సర్వీసెస్ కమర్షియల్ మేనేజరుగా నియమించారు. ఈమేరకు జిల్లాకు నియమితులైన వారిద్దరూ బుధవారం బాధ్యతలు స్వీకరించనున్నారు.

# చీరాల అభివృద్ధి పనులను వేగవంతం చేయండి

**'మీకోసం' అర్జీలపై కలెక్టర్, ఎమ్మెల్యే సమీక్ష**

**రూ.14కోట్లు మంజూరుకు హామీ**



అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటమురళి, ఎమ్మెల్యే కొండయ్య, జేసీ ప్రకర్‌జైన్

చీరాల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : చీరాల ప్రాంతంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ వెంకటమురళి, ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య చెప్పారు. మునిసిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(మీకోసం)లో వచ్చిన అర్జీల పరిష్కారంపై నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ముందుగా ఎమ్మెల్యే స్వీకరించిన అర్జీలతో పాటు ప్రధానంగా నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. మునిసిపల్ పరిధిలో డ్రెయినులు, అంతర్గత రహదారులు, విద్యుత్ సమస్యలు, ముఖ్యంగా 31వ వార్డులోని ఆక్రమణలపై ప్రస్తావించారు. అలాగే గ్రామాల్లోని లిఫ్టిరిగేషన్‌కు సంబంధించి మరమ్మతులకు గురైన యంత్రాలు గురించి మాట్లాడారు. తోటవారిపాలెం ఎత్తిపోతల పథకానికి రూ.20లక్షలు మంజూరు, మిగిలిన ఎత్తిపోతలు, నీటి అవసరాలపై చర్చించారు. ఫిషింగ్ హార్బర్ స్థలం పునఃపరిశీలన, హ్యాండ్‌లూమ్ పార్కు, ఇసుక కొరత గురించి మాట్లాడారు. జగనన్న కాలనీలు అధ్వానంగా ఉన్నట్లు చెప్పారు. కారంచేడు రైలు గేటువద్ద గేట సమస్యతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులుపడుతున్నట్లు తెలిపారు. అనంతరం ఒక్కో అంశంపై కలెక్టర్ ఆయా శాఖల అధికారులతో చర్చ సాగించారు. తాగునీటికి సంబంధించి ఇప్పటికే మునిసిపాల్టీలో రూ.1.50కోట్ల నిధులు ఉన్నట్లు కమిషనర్ ద్వారా తెలుసుకున్నారు. పన్ను వసూళ్లలో మరో రూ.కోటి వరకు అవకాశం ఉంటుందని చెప్పడంతో సమస్యకు పరిష్కారం చూడాలని సూచించారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ గతంలో బీచ్ అభివృద్ధితో పాటు పట్టణంలో పలు పనులకు మొత్తంగా రూ.14కోట్లు అందిస్తామని చెప్పారు. సత్వరమే అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. జేసీ ప్రకర్‌జైన్, ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, తహసీల్దార్ గోపీకృష్ణ పాల్గొన్నారు.

### కర్లపాలెం ఎస్‌ఐ వేధిస్తున్నారు

**ఇక్కుర్తి సుబ్బారావు, యాజలి**



మాకు చెందిన 1.50 ఎకరం భూమిలో వేరు శనగ పప్పు చల్లా. నెల గడిచాక కొందరు వ్యక్తులు మా పొలాన్ని దున్నేశారు. కర్లపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశాను. పట్టించుకోవడం లేదు. తిరిగి 5 క్వింటాళ్ల పప్పు కొని సాగుకు సిద్ధపడ్డాను. దాడులు చేస్తున్నారు. ఎస్సై వారితో కుమ్మక్కై, మమ్మల్ని బెదిరిస్తున్నారు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాను.

### కలుషిత నీటితో సాగుకు సమస్య

**- రమణారెడ్డి, రైతు సంఘం నాయకుడు**



మునిసిపాల్టీకి చెందిన మురుగు, వ్యర్థాలు దండుబాటలో నుంచి విజయనగర్ కాలనీ సమీపంలోని ఈపూరుపాలెం స్ట్రయిట్‌కట్‌లో కలుస్తున్నాయి. తద్వారా గవినివారిపాలెం ఎత్తిపోతల పథకం పరిధిలోని పిట్టువారిపాలెం, విజయలక్ష్మీపురం, పచ్చమొగిలి, కొత్తవాడరేవు, బుర్లవారిపాలెం, కీర్తివారిపాలెం, పెర్లవారి పాలెం, కొత్తపేట, పాపాయిపాలెం, చల్లారెడ్డిపాలెం ప్రాంతాలకు చెందిన సుమారు 5వేల ఎకరాల పంట పొలాలు దెబ్బతింటున్నాయి. వేల సంఖ్యలో మూగ జీవాలు ప్రాణాలు కోల్పోతున్నాయి. అధికారులు, పాలకులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

## ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

**చీరాల మునిసిపల్ కార్యాలయంలో 'మీకోసం'**

చీరాల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించే దిశగా ప్రజా సమస్యల వేదిక నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వెంకటమురళి పేర్కొన్నారు. సోమవారం చీరాల మునిసిపల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల వేదికలో జేసీ ప్రకర్ జైన్‌తో కలిసి ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య ఆధ్వర్యంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (మీకోసం) నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు వచ్చి అర్జీలను అందజేశారు. వీరిలో అధిక శాతం భూములకు, నివేశన స్థలాలు, హౌసింగ్, పెన్షన్‌ల సమస్యలు అధికంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా పరిధిలో గిరిజన, విభిన్న ప్రతిభావంతుల సమస్యలకు సంబంధించి ప్రతి మూడవ శనివారం మీకోసం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి, చీరాల పట్టణ అభివృద్ధి పనులపై మాట్లాడారు. అలాగే పట్టణంలో నివాసముంటున్న సంచారజాతులు (వేస్ట్ పిక్కర్స్) ప్రాంతాన్ని పరిశీలించి సమస్యలు తెలుసుకొని త్వరలో వారికి నివేశన స్థలాలు కేటాయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారి గంగాధర్ గౌడ్, డీపీవో ప్రభాకర్, డ్వామా పీడీ విజయలక్ష్మి, మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ రాధా మాధవి, జిల్లా వైద్యాధికారి విజయమ్మ, జిల్లా సంక్షేమశాఖ అధికారి రాజ్ దిబోరా, చీరాల ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, మునిసిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్, చీరాల వేటపాలెం తహసీల్దార్‌లు గోపీకృష్ణ, పార్వతి పాల్గొన్నారు.

# వెలమవారిపాలెం తిరునాళ్లలో ఘర్షణ

**మైలవరానికి చెందిన ఇరు వర్గీయుల మధ్య తోపులాట**

**అప్రమత్తమైన అద్దంకి పోలీసులు**

**ప్రస్తుతం సద్దుమణిగిన వివాదం**

**వైసీపీ పాలనలో గతంలో ఎన్నడూ లేనివిధంగా టీడీపీ నేతలపై ఎడాపెడా కేసులు**

అద్దంకి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : తిరునాళ్లలో మైలవరం గ్రామానికి చెందిన టీడీపీ, వైసీపీ వర్గీయుల మధ్య తోపులాటలు జరిగాయి. దీంతో ఆ గ్రామంలో గొడవలు జరిగే అవకాశం ఉందన్న సమాచారం అందుకున్న అద్దంకి పోలీస్‌లు అప్రమత్తమయ్యారు. దీంతో పరిస్థితి కాస్త సద్దుమణిగింది. వివరాలలోకి వెళితే.. బల్లికురవ మండలం వెలమవారిపాలెంలో ఆదివారం రాత్రి ఆంజనేయస్వామి తిరునాళ్ల జరిగింది. పక్క గ్రామమే కావడంతో అద్దంకి మండలం మైలవరానికి చెందిన టీడీపీ, వైసీపీ వర్గీయులు పెద్ద సంఖ్యలో తిరునాళ్లకు వెళ్లారు. అక్కడ భోజనాలు తినే సమయంలో టీడీపీ, వైసీపీ వర్గీయుల మధ్య వివాదం మొదలైంది. పోలీస్‌లు వారించడంతో వెనక్కి తగ్గారు. అనంతరం టీడీపీ వర్గీయులు కారులో వెళ్తూ హారన్ కొట్టారంటూ వైసీపీ వర్గీయులు ప్రశ్నించడంతో మళ్లీ వాగ్వివాదం రేగి తోపులాట చోటుచేసుకుంది. పోలీసులు వెంటనే అక్కడకు చేరుకోవడంతో గొడవ సద్దుమణిగింది. మైలవరంలో గతంలో జరిగిన హత్యాయత్నం కేసుకు సంబంధించి వైసీపీ వర్గీయులకు శిక్ష పడి ఉండడంతో తిరునాళ్ల ఘటనను బూచిగా చూపించి మరోసారి ఘర్షణ జరిగే అవకాశం ఉందని భావించిన పోలీసులు వెంటనే మైలవరం చేరుకున్నారు. సీఐ సుబ్బరాజు ఆధ్వర్యంలో సిబ్బంది ఇరువర్గాలకు హెచ్చరికలు జారీ చేశారు.

పోలీసులు రాకముందే కవ్వింపు చర్యలకు సిద్ధమైన ఇరు వర్గాల వారు పోలీసుల రాకతో పరుగులుదీశారు. ఎవరికివారే ఆధిపత్యం కోసం ప్రయత్నం చేస్తుండడంతో ఏ సమయంలోనైనా గొడవలు జరిగే అవకాశం ఉందని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. గతంలో ప్రశాంతంగా ఉండే మైలవరం గ్రామంలో గత వైసీపీ పాలనలో ఆ పార్టీ నేతలు ఇష్టానుసారంగా వ్యవహరించి టీడీపీ వర్గీయులపై ఎడాపెడా కేసులు నమోదు చేయించారు. ఈ క్రమంలో తరచూ ఘర్షణలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా పోలీస్‌లు ప్రత్యేక దృష్టి సారించి ఇరువర్గీయులకు కౌన్సెలింగ్ నిర్వహించాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

### సోమవరప్పాడులో ఇరువర్గీయుల మధ్య ఘర్షణ

**సీఎం చంద్రబాబు పుట్టినరోజు వేడుకల సమయంలో దూషించిన వైసీపీ వర్గీయులు**

బల్లికురవ మండలంలోని సోమవరప్పాడులో టీడీపీ, వైసీపీ వర్గీయుల మధ్య సోమవారం ఘర్షణ జరిగింది. సీఎం చంద్రబాబునాయుడు పుట్టిన రోజు సందర్భంగా టీడీపీ వర్గీయులు ఆదివారం సంబరాలు నిర్వహిస్తుండగా, వైసీపీ వర్గీయులు దూషించారు. ఈ విషయమై సోమవారం ఇరువర్గీయుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. దీంతో రెండు వర్గాలకు చెందిన గోపి, నాగేశ్వరరావులు పరస్పరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదులు చేసుకున్నారు.

# దొంగతనాలకు పాల్పడుతూ గంజాయి విక్రయించే ముఠా అరెస్ట్

**నాలుగున్నర కేజీల సరకు..**

**రూ.10 లక్షలు విలువైన సొత్తు స్వాధీనం**

**వివరాలను వెల్లడించిన సీఐ హజరత్తయ్య**



వివరాలను వెల్లడిస్తున్న సీఐ హజరత్తయ్య



స్వాధీనం చేసుకొన్న పంచలోహ విగ్రహం

సింగరాయకొండ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : దొంగతనాలకు పాల్పడుతూ, ఆ సొత్తుతో తక్కువ ధరకు గంజాయిని కొనుగోలు చేసి విక్రయించే ముగ్గురు సభ్యుల ముఠాను సింగరాయకొండ పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నాలుగున్నర కిలోల గంజాయి, రూ.10లక్షల విలువ చేసే వివిధ రకాల వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ చావా హజరత్తయ్య వివరాలను వెల్లడించారు. ఆయన కథనం మేరకు.. సింగరాయకొండ పంచాయతీ పరిధిలోని గుజ్జల యల్లమందారెడ్డి నగర్‌కు చెందిన కుంచాల గురవమ్మ శనక్కాయలు అమ్ముకుంటూ జీవనం సాగించేది. దానిద్వారా వచ్చే నగదు సరిపోవడంలేదని అడ్డదారిలో సంపాదించాలనే అత్యాశతో గంజాయి రవాణా చేయడం ప్రారంభించింది. రైలులో రాజమండ్రి వెళ్లి అక్కడ గంజాయిని కిలో రూ.1,500 చొప్పు కొనుగోలు చేసి దాన్ని చిన్నచిన్న ప్యాకెట్లగా చేసి కేజీ రూ.10వేలకు విక్రయిస్తోంది. ఈక్రమంలో దొంగతనాలకు పాల్పడుతూ అక్రమంగా నగదు సంపాదిస్తున్న ఒంగోలు మండలం పేర్నమిట్టకు చెందిన చిడితోటి మధుబాబు, బాపట్ల జిల్లా బల్లికురవ మండలం కొమ్మినేనివారిపాలేనికి చెందిన రాకూరి దుర్గారావు, తెలంగాణ రాష్ట్రం యాదగిరిగుట్ట మండలం యాదగిరిపల్లెకు చెందిన కళ్లెం రవికుమార్‌లకు గురవమ్మతో పరిచయం ఏర్పడింది. దొంగతనాలతో పాటు గంజాయి అమ్మకాల ద్వారా అధిక నగదు సంపాదించాలన్న దురాశతో వారు తరచూ గురవమ్మ దగ్గర గంజాయిని కొనుగోలు చేసి అమ్మకాలు చేస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం ముగ్గురు నిందితులు మధుబాబు, దుర్గారావు, రవికుమార్ గంజాయి ప్యాకెట్ల కోసం గుజ్జల యలమందారెడ్డి నగర్‌లోని గురవమ్మ దగ్గరకు వచ్చారు. ఒక్కొక్కరు కిలో గంజాయి కావాలని ఆమెను అడిగారు. ఆమె వెంటనే గోతం సంచిలో నుంచి గంజాయి ప్యాకెట్లు తీసి ఇస్తుండగా సింగరాయకొండ సీఐ హజరత్తయ్య, ఎస్సై బి.మహేంద్ర సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. పోలీసుల రాకను గమనించి పరారవుతున్న నలుగురినీ అరెస్ట్ చేశారు. అనంతరం నిందితులను పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారించగా అందులో మధుబాబు, దుర్గారావు, రవికుమార్‌లు రాష్ట్రంలోని పలు జిల్లాలలో దొంగతనాలకు పాల్పడినట్లు తేలింది. వారిపై వివిధ పోలీస్ స్టేషన్లలో 13 కేసులు ఉన్నట్లు నిర్ధారణ అయ్యింది. అనంతరం నిందితుల నుంచి రూ.10 లక్షల విలువచేసే 3 సవర్ల బంగారు ఆభరణాలు, పావు కిలో వెండి, ఇత్తడి, రాగి వస్తువులు, అమ్మవారి పంచలోహ విగ్రహం, శిలాతోరణం, పలు ఎలక్ట్రానిక్ వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. పలు జిల్లాలలో దొంగతనాలకు పాల్పడుతూ పోలీసుల కళ్లుగప్పి తిరుగుతున్న అంతర్ జిల్లాల దొంగల ముఠాను,గంజాయి సరఫరా చేసే నిందితులను చాకచక్యంగా పట్టుకొన్న సీఐ హజరత్తయ్య, ఎస్సై మహేంద్ర, సిబ్బందిని ఎస్పీ దామోదర్, డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు అభినందించారు.

### పరీక్ష ఫీజు చెల్లింపునకు నేడు తుది గడువు

ఒంగోలు విద్య, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి) : డిప్లమో ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్(డీఈఎల్‌ఈడీ) 2023-25 బ్యాచ్ నాల్గవ సెమిస్టర్ విద్యార్థులు మంగళవారం వరకు పరీక్ష ఫీజు చెల్లించవచ్చని డీఈవో కిరణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎటువంటి అపరాధ రుసుం లేకుండా రూ. 250 పరీక్ష ఫీజు చెల్లించాలన్నారు. రూ. 50 అపరాధరుసుంతో ఈనెల 27 వరకు పరీక్ష ఫీజు చెల్లించవచ్చని తెలిపారు. ప్రైవేటు విద్యార్థులు నాలుగు సబ్జెక్టుల వరకు రూ. 250, రెండు సబ్జెక్టులకు రూ. 150, ఒక సబ్జెక్టుకు రూ. 125 పరీక్ష ఫీజు చెల్లించాలన్నారు.

### ఐదు అంబులెన్స్‌లను అప్పగించిన కలెక్టర్

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్‌రైజ్ సంస్థ సహకారంతో సీఎస్‌ఆర్ కార్యక్రమంలో భాగంగా జిల్లాకు కేటాయించిన ఐదు బీఎల్‌ఎస్ అంబులెన్స్‌లను జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా సోమవారం జిల్లావైద్యఆరోగ్యశాఖకు అప్పగించారు. ఈ అంబులెన్స్‌లను సింహపురి ఎక్స్‌ప్రెస్‌వే లిమిటెడ్, టంగుటూరు టోల్‌ప్లాజా, జాతీయరహదారి-16వారి సీఎస్‌ఆర్ మద్దతుతో అందించారు.

**అవీఇవీ**

## పేలుడు పదార్థాల కేసులో చురుగ్గా దర్యాప్తు

మార్టూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : నిషేధ పేలుడు పదార్థాల వ్యాపారం కేసు దర్యాప్తు చురుగ్గా సాగుతోతోంది. మండలంలోని నాగరాజుపల్లికి చెందిన వైసీపీ నేత దానం హనుమంతరావును ఆదివారం అరెస్ట్ చేసిన పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. మార్టూరు సీఐ ఎం.శేషగిరిరావు ఆధ్వర్యంలో ఈ కేసులో మిగిలిన నిందితుల కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఇప్పటికే తెలంగాణ రాష్ట్రానికి రెండు ప్రత్యేక పోలీసు బృందాలు వెళ్లగా, వారిలో ఒక పోలీసు బృందం ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. అందుకు సంబంధించి పోలీసులు ప్రత్యేకంగా నిఘాతో కేసులో పురోగతిని సాధించేందుకు ప్రయత్నిస్తున్నారు. అంతేగాకుండా నాగరాజుపల్లి సమీపంలోని గొడౌన్‌లో ఉన్న అక్రమ పేలుడు పదార్థాల నిల్వలు, వాటి బిల్లులు, రశీదులు విషయంలో పలు వ్యత్యాసాలు ఉండడంతో ప్రత్యేకంగా పరిశీలిస్తున్నట్లు తెలిసింది. అదనపు సమాచారం మరింత విచారణ చేస్తున్నట్లు తెలిసింది. ఎప్పటి నుంచి వ్యాపారం చేస్తున్నారు, ఎవరెవరు సహకరిస్తున్నారు, ఇంకెవరైనా ఇలాంటి వ్యాపారాలు చేస్తున్నారా.. పేలుడు పదార్థాలను స్వార్థానికి వినియోగిస్తున్నారా అనే అంశంపై లోతైన విచారణ చేస్తున్నట్లు తెలిసింది. రెండుమూడు రోజుల్లో పూర్తిసమాచారం సేకరించే అవకాశాలు కన్పిస్తున్నాయి.

### కొలిక్కి వస్తున్న.. రీ సర్వే

(5వ పేజీ తరువాయి)

రాగా, ఒక్క బాపట్ల జిల్లాలోనే 4,115 వినతులు వచ్చాయి. వీటిలో దాదాపు 80 శాతం పరిష్కరించారు. మిగిలిన వాటి విషయంలో నిర్ణయాన్ని ఉన్నతాధికారులకు రిఫర్ చేసినట్లు యంత్రాంగం చెబుతోంది. అదే విధంగా రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన 9,500 అర్జీల్లో 75 శాతం ఇప్పటికే పరిష్కరించామని, మిగిలిన వాటిలో కసరత్తు జరుగుతుందనేది రెవెన్యూ విభాగం మాటగా ఉంది

**క్లిష్టతరం.....వైసీపీ నిర్వాకమే...**

గ్రామ సభలతో పాటు రెవెన్యూ సదస్సులు, ఇప్పుడు ఎంపిక చేసిన గ్రామాల్లో జరుగుతున్న రీ సర్వే ఘట్టం ఇలా ప్రతి అంకంలోనూ గ్రామాల్లో సంక్లిష్టంగా ఉండే భూ వివాదాలు పదుల సంఖ్యలోనే వెలుగు చూస్తున్నాయి. వాటిపై ఓ నిర్ణయానికి రావడం యంత్రాంగానికి సవాల్‌గా మారింది. పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసి రీ సర్వే చేపట్టిన మూడు జిల్లాల గ్రామాల పరిధిలో దాదాపు 1050 సర్వే నెంబర్ల విషయంలో తుది నిర్ణయానికి రావడం అధికారులకు క్లిష్టంగా మారింది. వీటి పరిధిలో ఉన్న చిక్కులను పరిష్కరించడం యంత్రాంగానికి సవాల్‌గా మారిందది. దీనికి ప్రధాన కారణం వైసీపీ నేతలు అధికారం అండతో రికార్డులు తారుమారు చేసి మరీ భూములను చెరబట్టారు. అధికారికంగా లెక్కల్లో భూమి వారిపేరు మీద ఉంది కానీ బాధితులు మాత్రం పెద్ద సంఖ్యలో కనబడుతున్నారు. కొంతమంది రె వెన్యూ సిబ్బంది అండతో అక్రమాలను సైతం పక్కాగా రెగ్యులరైజ్ చేయించుకునే తంతు గత ప్రభుత్వంలో విచ్చలవిడిగా నడిచింది. వీటి విషయంలో తుది నిర్ణయానికి వస్తే తప్ప గ్రామాల్లో భూ రికార్డులకు గాను ఫైనల్ ఆర్‌వోఆర్ ఓ కొలిక్కి వచ్చే అవకాశం లేదు. ఇలాంటి వాటిపై కూడా ఓ విధానపరమైన నిర్ణయం తీసుకునే దిశగా ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. రీ సర్వేని మమ అనిపించకుండా సదరు గ్రామాల్లో మళ్లీ భూ వివాదం అనే మాట వినపడడానికి వీల్లేదని, ఇదే సమయంలో బాధితుందరికీ న్యాయం జరగాల్సిందేనన్న పట్టుదలతో ప్రభుత్వం అడుగులేస్తుండడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది

### ప్రమాణాలకే.. ప్రాధాన్యం

(5వ పేజీ తరువాయి)

మారుస్తున్నారు. దీనికి అనుగుణంగా మార్కుల కేటాయింపు చేస్తారు. పార్ట్ -1 లో ఆంగ్లం , పార్ట్ 2లో జాతీయ భాషలతో పాటు మరికొన్ని సబ్జెక్టులు ఉంటాయి. విద్యార్థి తన అభిరుచి మేరకు ఏదైనా సబ్జెక్టును ఎంపిక చేసుకునే వెసులుబాటు ఇంటర్ బోర్డు కల్పించనుంది.

పార్ట్ -3లో ఎంపీసీ, బైపీసీ, హెచ్‌ఈసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపులు ఉన్నాయి. కొత్తగా ఈ విద్యా సంవత్సరం నుంచి ఎంబైపీసీ గ్రూపును కూడా ప్రవేశపెట్టనున్నారు. దీని ద్వారా ఇ టు ఇంజనీరింగ్ అటు మెడికల్ ప్రవేశ పరీక్షల్లో కూడా విద్యార్థులు పాల్గొనే అవకాశం కలుగుతుంది. ఇదిలా ఉంటే పార్ట్ 1, 2, 3లలో వచ్చిన మార్కులే పరిగణలోకి తీసుకుంటారు. ఇందులో కనీసం ప్రతి సబ్జెక్టులో 35 మార్కులు రావాల్సి ఉంటుంది. వృత్తి విద్యా కోర్సుల్లో పాస్ మార్కుల్లో వ్యత్యాసం ఉంది. ఇక ఇంటర్‌లో విద్యార్థి ఎంచుకున్న అదనపు సబ్జెక్టుల్లో ఉత్తీర్ణులు అయితే మెడికల్, ఇంజనీరింగ్ బయోటెక్నాలజీ, బయో ఇన్ఫర్‌మాటిక్స్ వంటి కోర్సులు అధ్యయనానికి ఉపయోగపడతాయని అధ్యాపకులు చెప్తున్నారు.

**ప్రశ్నాపత్రంలో మార్పులు**

ప్రశ్నాపత్రం విషయంలో కూడా మార్పులు తీసుకురానున్నారు. సైన్స్ గ్రూపుల్లో ఎన్సీఈఆర్టీ సిలబస్‌ప్రకారం, ఆర్ట్స్ గ్రూపుల్లో హ్యూమానిటీస్ విధానాలను అనుసరించారు. సైన్స్ సబ్జెక్టుల్లో 85 మార్కులకు, ఇతర సబ్జెక్టుల్లో వంద మార్కులకు ప్రశ్నాపత్రం ఉంటుంది. ప్రయోగ పరీక్షలకు 30 మార్కులు కేటాయిస్తారు.ఇంకా నూతన మార్పులకు ఇంటర్ బోర్డు శ్రీకారం చుడుతోంది. విద్యార్థులు భవిష్యత్తులో జాతీయ స్థాయి పోటీ పరీక్షలు, ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో మెరుగైన ఫలితాలు సాధించేలా నూతన మార్పులు దోహదపడతాయని అధ్యాపకులు చెబుతున్నారు.

### తెల్లబోతున్న.. జొన్న

(5వ పేజీ తరువాయి)

చూపించి కొద్దిగా రంగులో వ్యత్యాసం కనిపించినా రూ. 1700 నుంచి రూ. 1800 వరకుమాత్రమే కొంటామని, లేకుంటే తీసుకుపోవాలంటూ తిప్పి పంపుతున్న పరిస్థితి ఉంది. అయితే కొనుగోలు కేంద్రాలు ఉంటే, మరో ప్రత్యామ్నాయం రైతుల ముందుండేది. ఇప్పుడు ఏదీ లేకపోవటంతో వ్యాపారులు, దళారులు బెదిరిస్తున్నా చేసేదిలేక వారు చెప్పిన రేటుకే తెగనమ్ముతున్నారు. మరోపక్క నిల్వ ఉంచుకుందామన్నా, మొక్కజొన్నయితే పర్వాలేదు కానీ, తెల్లజొన్న ఏమాత్రం రంగు మారినా, బూజు పట్టినా రేటు విషయంలో అసలుకే నష్టం వస్తుందనే ఆలోచనతో రైతులు నిల్వ ఉంచటానికి ధైర్యం చేయటంలేదు.

**జొన్నలు కొంటామని ఒకసారి.. కొనలేమని మరోసారి**

జొన్నలు కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలుచేస్తాం... రేటు లేదని ఆందోళన పడాల్సిన పనిలేదు... ఇదీ గతవారం క్రితం పౌరసరఫరాల శాఖ అధికారులు చేసిన ప్రకటన. లేదు.. లేదు.. మీ జొన్నలు మేం కొనలేం. మేమేపొరపాటు పడ్డాం. మనుషులు తినేవి కాదు కనుక మేము కొనటానికి వీలులేదంటూ రెండు రోజుల తర్వాత మరో ప్రకటన. మొదటి ప్రకటన వచ్చినప్పుడు రైతులంతా సంతోషించారు. తమ జొన్నలు రేటు లేనితరుణంలో ప్రభుత్వం కొంటుంది కనుక నష్టం ఉండదని ఊపిరి పీల్చుకున్నారు. ఆ ఆనందం ఎన్నో రోజులు నిలవలేదు. రెండు రోజుల్లోనే మరో ప్రకటన కూడా అధికారుల నుంచే విడుదలయిందని, కేంద్రం సూచించిన ప్రకారం మన ప్రాంతంలో పండించే జొన్నలు మనుషులు తినేందుకు పనికివచ్చేవి కాదని, వాటిని పరీక్షిస్తే హానికర క్రిమిసంహారకాలు పెద్ద మోతాదులో ఉన్నట్లు తేలిందని, అందువల్ల ఆ జొన్నలు కొనలేమంటూ మరో ప్రకటన చేశారని రైతులే చెబుతున్నారు. దీని ప్రకారం చూస్తే ఇకపై కొనుగోలు కేంద్రాలు రబీ పంటల కొనుగోలుకు ఉండవనేది తేలిపోయిందని, అర్ధంతరంగా ఇటువంటి నిర్ణయం తీసుకుంటే ఎట్లాగంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ప్రకారం రూ. 3,460 అవసరం లేదని, కనీసం రూ. 2400 నుంచి రూ. 2600 వరకు జొన్నల నాణ్యతనుబట్టి రేటు నిర్ణయించినా చాలని వేడుకుంటున్నారు. కేంద్రాలు తెరవలేని పక్షంలో కనీస ధర అందేలా చూడాలని, ప్రభుత్వం దీనిపై వెంటనే ఒక నిర్ణయం తీసుకోకుంటే జొన్న రైతులు అప్పులపాలు కావటమేనంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోపక్క మినుములు, పెసలకూ మద్దతు ధర నిర్ణయిస్తే అంతటి రేటు అందుతున్న పరిస్థితిలేదు. మినుములు క్వింటాకు రూ. 7,400, పెసలు క్వింటాకు రూ. 8,682 చొప్పున మద్దతు ధరను ప్రభుత్వం నిర్ణయించింది. ప్రాంతాలను బట్టి రేట్లలో వ్యత్యాసం ఉన్నా, మద్దతు ధరను అందుకున్న పరిస్థితిలేదు. వీటిపై కూడా దృష్టిపెట్టాలనేది రైతుల విన్నపం. ఏదిఏమైనా జొన్న వంటి తక్కువ విస్తీర్ణంలో సాగయిన పంటలకయినా మద్దతు ధరకు దగ్గరగా కొనుగోలు చేయగలిగితే రైతులు గట్టెక్కినట్టే. పౌరసరఫరాల శాఖ దీనిపై నిబంధనల ప్రకారం కాకుండా రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని నిర్ణయం తీసుకోవలసిన అవసరం ఉంది.

# డంపింగ్ రహదారిగా మట్టిరోడ్డు

» అపరిశుభ్రంతో పాదచారులకు ఇక్కట్లు
» పట్టించుకోని గ్రామ పంచాయతీ

మార్టూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛాంధ్ర.. స్వచ్ఛ దివస్ పేరుతో ప్రభుత్వం గ్రామాలలో పరిశుభ్రత కార్యక్రమాలను చేస్తుంటే మంచి రోడ్డుగా ఉన్న మట్టి రోడ్డును డంపింగ్ రోడ్డుగా మారినా పట్టించుకోవడం లేదు. ఇదీ మార్టూరు గ్రామ పంచాయతీ తీరు. మార్టూరు మంచినీటి చెరువు పక్కన సాయిబాబా వాటర్ ప్లాంట్ నుంచి ప్రభుత్వ జూనియర్ కాలేజీ వరకు ఉన్న మట్టిరోడ్డు ను కొంత మంది పనికి రాని సామాను, పడగొట్టిన ఇంటి వ్యర్థాలు, గ్రానైట్ వ్యర్థాలను పడవేయడానికి అనుకూలంగా మార్చుకుంటున్నారు. పండుగలకు, ఫంక్షన్లకు వినియోగించిన విస్తరాకులను, ప్లాస్టిక్ గ్లాసులు తదితర వస్తువులను ఈ రోడ్డున పడేస్తున్నారు. దాంతో రోడ్డుపైన నడవాలంటే దుర్గంధంతో పాటు, వ్యర్థాలతో అంటు వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. రోజూ ఈ రోడ్డులో చెరువు కట్టపైకి వాకింగ్ కోసం వచ్చే ప్రజలు, పొలాలకు వెళ్లే రైతులు, ఆర్‌జేవీ ఎటీ కాలనీవాసులు, జూనియర్ కాలేజీకి వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంచాయతీ నిధులతో రోడ్డుపై ఎ గ్రమట్టి తోలి చదును కూడా చేశారు. కానీ ప్రస్తుతం ఈ రోడ్డు పై నడవాలంటే అనారోగ్య వాతావరణం కనిపిస్తుంది. ఈ రహదారి ఇంత దారుణంగా కన్పిస్తున్నా పంచాయతీవారు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే రోడ్డును బాగు చేయాలని కోరుతున్నారు.


చెరువు పక్కన ప్రభుత్వ జూనియర్ కాలేజీకి వెళ్లే రోడ్డుపై వేసిన వ్యర్థాలు


గుట్టలుగా పడవేసిన గ్రానైట్ వ్యర్థాలు


ఉప్పుటూరు ప్రధాన రోడ్డులో ఉన్న డ్రేనేజీ పరిస్థితి ఇలా

## స్వచ్ఛాంధ్రకు తూట్లు

### గ్రామాల్లో కొరవడిన పారిశుధ్యం

పర్చూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛాంధ్ర..స్వర్ణాంధ్ర లక్ష్యానికి తూట్లు పడుతున్నాయి. ఈ నినాదాలు కేవలం ప్రకటనలకే పరిమితమవున్నాయని చెప్పడానికి మండలంలోని ఉప్పుటూరు గ్రామం నిదర్శనం. గ్రామాల్లో పారిశుధ్యం ఎక్కడి వేసిన గొంగళి అక్కడేలా మారింది. మురుగు కాలువల్లో నీరు రోజుల తరబడి నిల్వ ఉండడంతో అందులో ఫంగస్ పేరుకుపోయి కంపు కొడుతోంది. దీంతో దోమల బెడద పెరిగిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎక్కడ చూసినా మురుగు కాలువల్లో చెత్తాచెదారం పేరుకుపోయి రంగుమారి తీవ్రమైన కంపు కొడుతోంది. అయినా పట్టించుకునేవారులేరని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



వేటపాలెంలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

## ముస్లింల ర్యాలీ

వేటపాలెం(చీరాల), ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : వక్ఫ్ సవరణ చట్టంతో ముస్లింల అభ్యున్నతి అంధకారంలో పడుతుందని వెంటనే చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని ముస్లిం నాయకులు, మత పెద్దలు అన్నారు. సోమవారం వేటపాలెంలో పెద్ద ఎత్తున నిరసన ర్యాలీ నిర్వహించారు. బీజేపీ కుతంత్ర ధోరణితోనే చట్టాన్ని అమలులోకి తెస్తున్నట్లు ఆరోపించారు. డీటీ శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ముస్లిం సామాజిక వర్గం ప్రజలు పాల్గొన్నారు.

బల్లికురవ : కేంద్రం తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా సోమవారం ముస్లింలు శాంతి ర్యాలీని నిర్వహించారు. మసీద్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టి, తక్షణమే చట్టాన్ని రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ రవినాయక్‌కు వినతిపత్రం అందజేశారు.

## విద్యామిత్ర స్టాక్ పాయింట్ పరిశీలన

మార్టూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : జడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన సర్వేపల్లి రాధాకృష్ణ విద్యా మిత్ర కిట్ల మండల స్టాక్ పాయింట్ గదులను సోమవారం జిల్లా సమగ్ర శిక్షా అధికారులు తనిఖీ చేశారు. ప్రభుత్వం పంపిణీ చేసిన కిట్లను జాగ్రత్తగా విద్యార్థులకు అందించాలని వారు సూచించారు. కార్యక్రమంలో సీఎంవో శ్రీనివాసరావు, ఎంఈవోలు వస్రాంనాయక్, కె ప్రేమలత, హెచ్‌ఎం రూత్ మెర్సీ, సీఆర్పీలు రామారావు, రమేష్ పాల్గొన్నారు.

## నేడు మండల సర్వసభ్య సమావేశం

చినగంజాం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశపు హాల్‌లో మంగళవారం ఉదయం 11గంటలకు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో అద్దంకి శ్రీనివాసమూర్తి తెలిపారు. మండల పరిషత్ అధ్యక్షుడు కోమట్ల అంకమ్మరెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు తమ తమ శాఖల ప్రగతి నివేదికలతో సమావేశానికి హాజరు కావాలన్నారు. సమావేశానికి జడ్పీటీసీ సభ్యుడు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు, గ్రామ సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు తప్పని సరిగా హాజరు కావాలని ఎంపీడీవో కోరారు.

## గాయపడిన వ్యక్తి మృతి

పంగులూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముప్పవరం ఫ్లైవోవర్‌పై కారు బైకును ఢీకొన్న ఘటనలో గాయపడ్డ జంపు శంకరరావు (55) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. పంగులూరు గ్రామానికి చెందిన శంకరరావు మార్టూరు కూరగాయల మార్కెట్లో రోజువారీ కూలీగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ నెల 10న పని ముగించుకుని మార్టూరు నుంచి పంగులూరుకు బైక్‌పై వస్తుండగా ముప్పవరం ఫ్లై ఓవర్ వద్ద కారు బైకును ఢీకొట్టింది. తలకు గాయమైన శంకరరావును 108లో అద్దంకి వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలులోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడి నుంచి గుంటూరు ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్సనందిస్తుండగా ఆదివారం మృతి చెందారు. శంకరరావుకు భార్య, వివాహం అయిన కుమార్తె, బీటెక్ చదువుతున్న కుమారుడు సంతానం.

## హత్య కేసులో భర్త అరెస్ట్

యద్దనపూడి, (మార్టూరు) ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : భార్య మంగమ్మను గడ్డపారతో హత్య చేసిన భర్త నీలం శ్రీనివాసరావును సోమవారం యద్దనపూడి మండలం యనమదల గ్రామం ప్రధానసెంటర్‌లో అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ టీ రత్నకుమారి తెలిపారు. యద్దనపూడి మండలంలోని యనమదలలో శనివారం అర్ధరాత్రి భార్య మంగమ్మను భర్త శ్రీనివాసరావు గడ్డపారతో కొట్టి హత్య చేసిన విషయం తెలిసిందే. కుమారుడు సాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు శ్రీనివాసరావును అరెస్ట్ చేశారు.మంగళవారం అతనిని కోర్టులో హాజరుపరచనున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

## ట్రాక్టర్ బోల్తా


కారంచేడు వద్ద బోల్తాపడిన శనగ కాయల లోడు ట్రాక్టర్

కారంచేడు (పర్చూరు), ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : కారంచేడు నుంచి పర్చూరు వైపు వస్తున్న వేరు శనగ కాయల లోడుతో వస్తున్న ట్రాక్టర్ బోల్తా పడిన ఘటన సోమవారం వెంకటేశ్వర స్వామి ఆలయం సమీపంలో చోటుచేసుకుంది. లోడుతో ఉన్న ట్రాక్టర్ ఒక్కసారిగా రోడ్డు మార్జిన్‌లో వరిగిపోయి బోల్తా పడింది. దీంతో ట్రాక్టర్‌లో ఉన్న వేరుశనగ బస్తాయి రోడ్డుపై చెల్లాచెదురుగా పడిపోవడంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని రోడ్డుపై ఉన్న శగన బస్తాలను తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకించారు.

## మహిళను వేధిస్తున్న వ్యక్తిపై కేసు

ఈపూరుపాలెం(చీరాల), ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ఒంటరిగా ఉన్న మహిళను వేధిస్తున్న వ్యక్తిపై ఈపూరుపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. ఈపూరుపాలెం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గవినివారిపాలెంకు చెందిన నక్కల వెంకటేశ్వర్లు అదే ప్రాంతానికి చెందిన ఒంటరి మహిళను వేధిస్తున్నాడు. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

## వ్యక్తి ఆత్మహత్య

చినగంజాం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి) : వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని రాజుబంగారుపాలెం గ్రామ పరిధిలోని రైల్వేగేటు పక్కనే గల పొలాలలో సోమవారం వెలుగుచూసింది. స్థానికులు, ఎస్‌ఐ శీలం రమేష్ తెలిపిన సమాచారం మేరకు.. రాజుబంగారుపాలెం గ్రామ సమీపంలోని రైల్వేగేటు పక్క పొలాల్లో ఉన్న పూరి గుడిసెలో ఉరేసుకొని కొండలు(30) అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామానికి చెందిన కే.గంగిరెడ్డి పొలంలో ఉన్న పూరిగుడిసెలో మూడేళ్లుగా కొండలు ఉంటున్నాడు. గ్రామంలో యాచించుకున్న డబ్బులతో జీవిస్తూ ఉంటాడు. కొద్దిరోజుల కిందట భార్య కుమారినితో వచ్చినట్లు స్థానికులు తెలిపారు. సోమవారం ఆ ప్రాంతానికి వెళ్లిన స్థానికులకు పూరిగుడిసె నుంచి దుర్వాసన రావడంతో పోలీసులకు సమాచారమిచ్చారు. ఎస్‌ఐ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. నాలుగు రోజుల కిందట చనిపోయినట్లు భావిస్తున్నారు. వీఆర్వో పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

## పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి

ఇంకొల్లు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కలిపించాలని కోరుతూ వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మధుసూదనరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ వెంకటరత్నంకు వినతిపత్రం అందజేసారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి, నాయకులు చిన్నిపూర్ణారావు, ప్రభాకరరావు పాల్గొన్నారు.


విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

## బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలి

అద్దంకిటౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : బడిఈడు పిల్లలను కచ్చితంగా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కాంప్లెక్స్ హెచ్‌ఎం గంగాధరరావు అన్నారు. సోమవారం మండలంలోని తిమ్మాయపాలెం ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అర్హత కలిగిన ఉపాధ్యాయులతో తెలుగు, ఇంగ్లీష్ మీడియంలో ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా బోధన ఉంటుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రమణరెడ్డి, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చీరాల : పేదలకు ప్రభుత్వ పాఠశాలల్లో అవకాశాలు మెండని ఎస్‌ఆర్ అండ్ వీఎం హైస్కూల్ ప్రధానోపధ్యాయుడు వెంకటేశ్వర్లు, సైన్స్ జిల్లా కో-ఆర్డినేటర్ పవని భానుచంద్రమూర్తి అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పలు ప్రైవేటు పాఠశాలల్లో ప్రచారం నిర్వహించారు.

## అంగన్‌వాడీ కేంద్రాలను వినియోగించుకోవాలి

పర్చూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : చిన్నారుకు విద్య, పౌష్టికాహారం అందించే అంగన్‌వాడీ కేంద్రాలను తల్లిదండ్రులు వినియోగించుకోవాలని సూపర్‌వైజర్ పి.దీపాదేవి కోరారు. గ్రాడ్యుయేషన్ డే సందర్భంగా సోమవారం నెహ్రూకాలనీలో అంగన్‌వాడీ కేంద్రాల్లో చదివి ఐదేళ్లు నిండిన వారిని ప్రాథమిక పాఠశాలలో చేర్పించారు. కార్యక్రమంలో పాఠశాల, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



మాట్లాడుతున్న డీఎల్‌పీవో కుమారస్వామి

నూతలపాడు(పర్చూరు), ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని డీఎల్‌పీవో జి.కుమారస్వామి అన్నారు. చెత్త సంపద కేంద్రాల నిర్వహణపై మండలం నూతలపాడు గ్రామంలో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని చెత్తను సేకరించేటప్పుడు విధిగా తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని దీనిపై పారిశుధ్య కార్మికులకు అవగాహన కల్పించాలని కార్యదర్శులకు సూచించారు. అనంతరం ఎంపీడీవో ప్రద్యుమ్నకుమార్ మాట్లాడుతూ వేసవి దృష్ట్యా పంచాయతీ ఆధ్వర్యంలో చలివేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ కె.సత్యనారాయణ, సర్పంచ్ కాకర్లమూడి చిన్నయ్య, పంచాయతీ కార్యదర్శి కేవీ కృష్ణమోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

## ఏకాభిప్రాయంతో ఎన్నిక మంచి సంప్రదాయం


సమావేశంలో పాల్గొన్న విశ్రాంత ఉద్యోగ సంఘ సభ్యులు

అద్దంకిటౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ఏకాభిప్రాయంతో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం మంచి సంప్రాదాయం సభ్యులు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. సోమవారం అద్దంకిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం అద్దంకి యూనిట్ సమావేశం సంఘ కార్యాలయంలో షేక్ మస్తాన్ అధ్యక్షతన జరిగింది. ఈ నెల 26న గీతామందిర్‌లో అద్దంకి యూనిట్ నూతన కార్యవర్గం ఎన్నిక జరుగుతుందని, అద్దంకి, జె.పంగులూరు, కొరిశపాడు మండలాల చెందిన ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులు అందరు పాల్గొన్నాలని సభ్యులు కోరారు. కార్యక్రమంలో టీ కృష్ణయ్య, పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, కోటేశ్వరరావు, మురళీధరరావు, అంజలీదేవి, అంజయ్య, సత్యనారాయణ, సైదా పాల్గొన్నారు.

## వృక్ష సంరక్షణ బాధ్యత అందరిదీ

అద్దంకిటౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): వృక్ష సంరక్షణ అందరి బాధ్యత అని తహసీల్దార్ శ్రీచరణ్ అన్నారు. సోమవారం ప్రపంచ ధరిత్రి దినోత్సవం సందర్భంగా రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో చెట్లకు నీరు పోసే కార్యక్రమం మాజీ అధ్యక్షుడు మన్నం త్రిమూర్తులు సౌజన్యంతో నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల ప్రాంగణాల్లో ఉన్న చెట్లకు పాదులు చేసి నీటిని పోశారు. ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి సంరక్షించాలని చరణ్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఎస్‌వో అమర్‌నాథ్, రోటరీ అధ్యక్షుడు వీరయ్య, దేవపాలన, శ్రీనివాసరావు, మురళీసుధాకరరావు, బాబురావు, చంద్రమౌళి, పవన్, లక్ష్మిరెడ్డి, శ్రీను, శివ పాల్గొన్నారు.


మొక్కకు నీళ్లు నింపుతున్న తహసీల్దార్ శ్రీచరణ్, రోటరీ సభ్యులు

# ఉపాధ్యాయులు, ఉద్యోగులకు సముచిత స్థానం

### అభివృద్ధి పనులు ప్రారంభించిన మంత్రి గొట్టిపాటి

సంతమాగులూరు ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వంలో ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు సముచిత స్థానం కల్పిస్తున్నట్లు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. సోమవారం మండలంలోని చవిటిపాలెం గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. గ్రామంలో రూ.10లక్షలతో నిర్మించిన ఎన్టీఆర్ పార్కు, వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. అలాగే రూ.30లక్షలతో వేసిన సీసీ రోడ్లు, రూ.78.17లక్షల ఖర్చుతో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తరగతి గదులను మంత్రి ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో మంత్రి రవికుమార్ మాట్లాడుతూ జగన్‌రెడ్డి మద్యం దుకాణాల వద్ద ఉపాధ్యాయులను కాపలా పెట్టి ఉపాధ్యాయ వృత్తిని అవమానించి వారిని మానసిక క్షోభకు గురి చేశారన్నారు. యువతకు ఇచ్చిన మాట ప్రకారం డీఎస్సీతో 16,347 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తున్నామన్నారు. ఇప్పటివరకు అత్యధిక సార్లు డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసింది తెలుగుదేశం పార్టీ మాత్రమే అన్నారు. మంత్రి లోకేష్ నాయకత్వంలో విద్యా వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ తేలప్రోలు రమేష్, చేవూరి వాసురెడ్డి, తహసీల్దార్ కే రవిబాబు, ఎంఈవో వీ కోటేశ్వరరావు, ప్రణతి, కోమటినేని శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ అధికారులు, గ్రామ సర్పంచి వల్లెపు వీరాంజనేయులు, మాజీ సర్పంచి గూళ్ల ఏడుకొండలు, టీడీపీ గ్రామ నాయకులు గంజి శ్రీను, పాఠశాల ప్రధానోపాధ్యాయులు డేవిడ్, డ్రిల్ మాస్టర్ కృష్ణారెడ్డి, పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.


చవిటిపాలెంలో ఎన్టీఆర్ పార్కును ప్రారంభిస్తున్న మంత్రి గొట్టిపాటి

## ఆదివాసీలపై దాడులు అన్యాయం

చీరాల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిశా రాష్ట్రాల్లో సహజ ఖనిజ సంపదను కాపాడుతున్న ఆదివాసీలపై జరుగుతున్న దాడులు అన్యాయమని పలు సంఘాల నాయకులు అన్నారు. సోమవారం సీనియర్ సిటిజన్స్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఆపరేషన్ కగార్ పేరుతో జరుగుతున్న మారణకాండను తక్షణమే ఆపాలని, మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర చేనేత జన సమాఖ్య నాయకులు మాచర్ల మోహన్‌రావు, వైహెచ్‌వీఎస్ నాయకులు మోహనకుమార ధర్మ, వెంకటేశ్వర్లు, హరిహరరావు, విమలాకర్, గుంటూరు మల్లికార్జునరావు పాల్గొన్నారు.

## తిరగబడ్డ కారు.. ఇద్దరికి గాయాలు


తిరగబడ్డ కారు

పంగులూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అలవలపాడు అడ్డ రోడ్డు సమీపంలో కారు బోల్తా పడిన ఘటనలో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. అందిన సమాచారం మేరకు తమిళనాడు రాష్ట్రం వేలూరు నుంచి బిహార్ వెళ్తున్న కారు ముందు టైరు బరెస్ట్ కావడంతో రోడ్డు మధ్యలో ఉన్న సిమెంట్ దిమ్మెలను ఢీకొని బోల్తా పడింది. సోమవారం అలవలపాడు అడ్డ రోడ్డు సమీపంలో జాతీయ రహదారిపై జరిగిన ఈ ప్రమాదంలో కారు డ్రైవర్ జి.మురళీధరన్ (వేలూరు)తో పాటు అందులో ప్రయాణిస్తున్న శశికళ అనే మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న హైవే పెట్రోలింగ్ సిబ్బంది క్షతగాత్రులను హైవే అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం ఒంగోలు కిమ్స్‌కి తరలించారు.


శిక్షణ సర్టిఫికెట్లతో కేజీబీవీ విద్యార్థినులు

## కేజీబీవీ విద్యార్థినులకు వృత్తి శిక్షణ సర్టిఫికెట్లు

బల్లికురవ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, జూనియర్ కళాశాలలో ఈ ఏడాది వృత్తి శిక్షణ పొందిన విద్యార్థినులకు సోమవారం సమగ్ర శిక్ష ద్వారా వచ్చిన సర్టిఫికెట్లను ప్రిన్సిపాల్ కె.సరళకుమారి అందజేశారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యాలయంలో చదువుతో పాటు బాలికలకు వృత్తి శిక్షణ ఇచ్చి వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తున్నామని తెలిపారు. 10, ఇంటర్ విద్యార్థినులు 56 మందికి ఒకేషనల్ ట్రైనర్ శిరీష పర్యవేక్షణలో 80 గంటల పాటు మార్టూరులోని అమరావతి టెక్స్‌టైల్స్‌లో శిక్షణ ఇచ్చామని, వారికి సమగ్ర శిక్షా ద్వారా వచ్చి సర్టిఫికెట్లను అందజేశామని ఆమె తెలిపారు.

## బాల్య వివాహాలు జరగకుండా చూడాలి

అద్దంకిటౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో బాల్య వి వాహాలు జరగకుండా ఆయా శాఖల వారు చూడాలని ఎంపీడీవో బత్తిన సింగయ్య సూచించారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో మహిళా సంరక్షణ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. గ్రామ స్థాయిలో కమిటీ సమావేశాలు నిర్వహించి బాల్య వివావాహాల పట్ల నిరోధం పట్ల అవగాహన కల్పించాలన్నారు. బాల్య వివాహాలు చేయకుండా కిశోరబాలికల తల్లిదండ్రులకు మహిళా పోలీస్, అంగన్‌వాడీ, ఏఎన్‌ఎం ఇతర సభ్యులు అ వగాహన కల్పించాలన్నారు.


మాట్లాడుతున్న ఎంపీడీవో సింగయ్య

# శరవేగంగా కాలువకు మరమ్మతు పనులు


పమిడిపాడు మేజర్‌లో ఎక్స్‌కవేటర్‌తో చేపట్టిన కాలువ మరమ్మతులు

పంగులూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి బ్రాంచ్ కెనాల్ పరిధిలోని పమిడిపాడు మేజర్‌లో కాలువ మరమ్మతు పనులు శరవేగంగా సాగుతున్నాయి. పమిడిపాడు మేజర్‌తో పాటు ఆ మేజర్‌కు అనుబంధంగా పంగులూరు, అద్దంకి, కొరిశపాడు, ఇంకొల్లు మండలాల విస్తరించి ఉన్న 8 మైనర్లలో ఈ కాలువ మరమ్మతు పనులకు ఎన్ఎస్‌పీ అధికారులు 80 లక్షల వ్యయ అంచనాతో మరమ్మతు పనులకు శ్రీకారం చుట్టారు. విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చొరవ, నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు సహకారంతో నిధులు కేటాయించారు. టెండర్ ప్రక్రియ పూర్తి అయిన వెంటనే మరమ్మతులకు శ్రీకారం చుట్టారు. పంగులూరు డీసీ ఛైర్మన్ కుక్కపల్లి ఆంజనేయులు, ఎన్నెస్పీ అధికారుల పర్యవేక్షణలో ఐదు ఎక్స్‌కవేటర్లతో మేజర్‌పై చిల్ల చెట్ల తొలగింపు, పూడిక తీత పనులు వేగంగా జరుగుతున్నాయి. నాలుగు మండలాల పరిధిలో 150 కిలోమీటర్ల విస్తీర్ణంలో పలు ప్రాంతాల్లో ఉన్న మేజర్, మైనర్ కాలువలలో మరమ్మతులు చేస్తున్నట్లు డీసీ ఛైర్మన్ తెలిపారు.